ప్రజాశక్తి

మంగళవారం 30 సెప్టెంబర్ 2025 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

లంక గ్రామాలకు రాకపోకలు బంద్

- చుట్టు ముట్టిన వరద నీరు
- కొనసాగుతున్న రెండో ప్రమాద హెచ్చరిక
- ప్రజలను అప్రమత్తం చేసిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

కృష్ణానదిలో వరద నీరు పెరగడంతో రేపల్లె డివిజన్ లోని కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల పరిధిలోని లంక గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. గత మూడు రోజులుగా ప్రకాశం బారేజి నుంచి దిగువకు వరదనీరు పోటేత్తడంతో కష్ణానది పరివాహక ప్రాంతంలోని లంక గ్రామాల ప్రజలు బిక్కుబిక్కు మంటూ కాలం గడుపుతున్నారు.గతేడాది కూడా సెప్టెంబరులో కష్ణానదికి వరదలు వచ్చాయి. ఆ సమయంలో అధికారులు సకాలంలో చర్యలు తీసుకోవడంతో ప్రాణనష్టం జరగలేదు. పంటలకు అపారనష్టం వాటిల్లింది. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలు నిండడంతో గేట్లు ఎత్తి దిగువకు నీరు విడుదల చేస్తున్నారు. దీంతో ప్రకాశం బారేజి కూడా నిండుకుండలా మారింది. దిగువకు కృష్ణా నది జలాలు దండిగా వస్తున్నాయి. సోమవారం రాత్రికి 7 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వస్తుంది. దీంతో నదీ పరివాహక గ్రామాల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. కష్ణానదికి వరద ముప్పు పెరగడంతో కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల పరిధిలోని లంక గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయాయి. పెనుమూడి పల్లెపాలెం లోని లోతట్టు ప్రాంతాల్లోకి నీరు వచ్చింది. భట్టిప్రోలు మండలంలోని వెల్లటూరు, చినరేవు చప్టాపై వరద నీరు ప్రవహిస్తుంది. వరద ఉధృతి మరింతగా పెరిగే అవకాశం ఉండడంతో బలహీనంగా ఉన్న చోట కరకట్టలను అధికారులు

స్థానికులతో మాట్లాడుతున్న జిల్లాకలెక్టర్ వినోద్ కుమార్

వరదల కారణంగా నీట మునిగిన ఇటుక బట్టీలు

యుద్ధప్రాతిపదికన పటిష్టం చేస్తున్నారు. లంక గ్రామాలలో అరటి, కంద, పసుపు, బొప్పాయి, తమలపాకు, కూరగాయ పంటలు ముంపులో చిక్కుకున్నాయి.ఇటుక బట్టీలు వరదనీటిలో ఉన్నాయి.

జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ రేపల్లె ఆర్‌డిఒ రామలక్ష్మి, డిపిఒ ప్రభాకర్ రావు, డిఎం అండ్ హెచ్ఒ డాక్టర్ విజయమ్మ, ఇతర అధికారులతో కలిసి కృష్ణ నది వరదల ముంపు ప్రాంతాలైన రేపల్లె మండల పరిధిలోని పెనుమూడి, పల్లె పాలెం,చాత్రగడ్డ, బొబ్బర్లంక, పిరాట్లంక, లంకె వాని దిబ్బ, ఎస్‌టి కాలనీల్లో పర్యటించారు. అక్కడ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల లోని ఏర్పాట్లు, వసతులను పరిశీలించారు. పునరావాస కేంద్రాలలో ఉన్న ప్రజలతో కలెక్టర్ మాట్లాడారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ఇక్కడే ఉంటారని, ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే అధికారులకు తెలియజేయాలన్నారు. హెబిటేషన్, రీహెబిటేషన్లు కు కేటాయించిన అధికారులు సిబ్బంది రాత్రి పగలు అక్కడే ఉండాలన్నారు. రీహెబిటేషన్ కేంద్రాల అన్ని రకాల మందులు అందజేయాలన్నారు. ,వైద్య సిబ్బంది కూడా రీహెబిటేషన్ కేంద్రాల్లో ఉండాలని డి ఎంఅండ్ హెచ్ఒను ఆదేశించారు. హెబిటేషన్స్, రీహెబిటేషన్లు పరిధిలో శానిటేషన్ చేయించాలని డిపిఒను ఆదేశించారు. రేపల్లె మండలం పెనుమూడి వద్ద కష్ణానది పరివాహక ప్రాంతాన్ని అక్కడ అందుబాటులో ఉన్న బోట్స్‌ను పరిశీలించారు. కష్ణ నదిలో పూర్తిగా నీటి ప్రవాహం తగ్గే వరకు పునరావాస కేంద్రంలో ఉండాలని ప్రజలకు సూచించారు. కృష్ణానదిలో నీటి ప్రవాహం మరింతగా పెరిగినా ఎదుర్కొనడానికి అధికారులందరూ సిద్ధంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

▶ 4లో

ఉద్యోగుల హక్కుల కోసం సిఐటియు పోరాటం

▶ 3లో

కాగితాలకే పరిమితమైన కృష్ణానది కరకట్ట

▶ 6లో

కృష్ణానదికి భారీ వరద

- రిజర్వాయర్లు గేట్లు ఎత్తి సముద్రంలోకి నీరు
- వెలిగొండ ప్రాజెక్టు పూర్తయితే ఆ నీళ్లు మనకు వచ్చేవి
- పాలకుల నిర్లక్ష్యంతో సాగునీరు వృథా

వరద నీటితో బాపట్ల జిల్లాలో నీట ముగిన పొలాలు

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

కృష్ణానదికి మరోసారి వదర పోటెత్తుతోంది. ఎగువనున్న అన్ని రిజర్వాయర్లు నిండిపోయాయి.అన్ని ప్రాజెక్టుల గేట్లు ఎత్తేశారు.ఒకవైపు పర్యాటకులకు ఆనందంగా ఉండగా.. మరోవైపు రైతుల పొలాల్లో ఉండాల్సిన నీరంతా సముద్రం పాలవుతోందన్న ఆందోళన తప్పడం లేదు. ప్రాజెక్టులను పూర్తి చేస్తే ఈ నీరంతా సముద్రం పాలు కాకుండా నిల్వచేసుకునే అవకాశం ఉండేది. జిల్లాలో వెలిగొండ ప్రాజెక్టు నిండే అవకాశం ఈ ఏడాదిలోనే అనేకసార్లు వచ్చినా చేజారింది. దాన్ని పూర్తిచేయడంలో ప్రభుత్వాల వైఫల్యం రైతులకు శాపంగా మారింది.అదిగో ఇదిగో అంటూ కాలయాపనలు తప్ప ఆచరణలో దాన్ని పూర్తిచేయాలనే ఆలోచనే కనిపించడం లేదు. జిల్లాలో కీలకమైన ఎజండా ఇదే. దీనికి తప్ప అన్నిటికీ ప్రాధాన్యత ఇస్తున్నారు. గత ప్రభుత్వంపై విమర్శలు చేసిన కూటమి నేతలు ఇపుడు వీరేంశారన్నదే ప్రశ్న.ఏడాదిలోపు వెలిగొండను పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు.ఏడాది దాటింది. హామీ గాలికి పోయింది. మళ్లీ ఇటీవల దర్శి వచ్చిన సిఎంచంద్రబాబు వచ్చే సీజన్‌కు నీరిస్తామని ప్రకటించారు.వాస్తవానికి ఈయన ఇలాంటి హామీలు గతంలో అనేకసార్లు ఇచ్చారు. 2014-19 మధ్య ఏటా వెలిగొండను పూర్తిచేస్తానంటూ చెప్పిందే చెబుతూ ఐదేళ్లు గడిపారు. ఇపుడు రెండో ఏడాదిలోనూ ఇదే మాట చెబుతున్నారు. నేనే శిలాపలకం వేశానని,నేనే పూర్తిచేస్తానంటూ

▶ 2లో

కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు

అమెరికా ఆధిపత్యాన్ని తిప్పికొట్టాలి

సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ హనీఫ్

ప్రజాశక్తి-పామూరు

వ్యాపారులు, ప్రజలు ఐక్యమై అమెరికా ఆధిపత్యాన్ని తిప్పి కొట్టాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ హనీఫ్ పిలుపునిచ్చారు. అమెకారి ఆదిపత్యాన్ని వ్యతిరేకిస్తూ పామూరు పట్టణంలోని నెల్లూరు రోడ్డు నుంచి కనిగిరి- సిఎస్‌పురం రోడ్డులోని పొట్టి శ్రీరాములు వీధి వరకూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హనీఫ్ మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం జిఎస్‌టి పేరుతో పేదల సొమ్ము రక్తంలా తాగిందని ఆరోపించారు. పేదల కడుపు కొట్టి ధనవంతులకు పెట్టారని ఆరోపించారు. నరేంద్ర మోడీ అమెరికా పెట్టుబడి దారులకు అమ్ముడు పోయారన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు విచలవిడిగా పెంచి ప్రజలపై భారాలు మోపారిన ఆరోపించాడు. వ్యాపారులు వాస్తవాలను పరిశీలించి, అవాస్తవలను వ్యతిరేకించాలన్నారు. అమెరికా ఆధిపత్యాన్ని ఐక్యంగా తిప్పి కొట్టాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి షేక్ ఖాదర్ బాషా, జిల్లా నాయకులు కె. మాల్యాద్రి, సయ్యద్ గౌస్ బాషా, పిచ్చిరెడ్డి, రబ్బాని, చల్ల వెంకటేశ్వర్లు, కె. శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ జిఎస్‌టి.. సూపర్ సేవింగ్: ఎంపిడిఒ

మాట్లాడుతున్న ఎంపిడిఒ జాన్ సుందరం

ప్రజాశక్తి-పెద్దారవీడు

జిఎస్టి తగ్గింపుతో పేద మధ్య తరగతి ప్రజలకు నిత్యావసర వస్తువులపైన కాకుండా గృహోపకర వస్తువుల పైన కూడా ధరలు తగ్గుతాయని పెద్దారవీడు ఎంపీడీవో ఎస్ జాన్ సుందరం తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ప్రభుత్వ ఉద్యోగులతో సోమవారం సమావేశం నిర్వహించారు. జీఎస్టీ తగ్గింపుతో తగ్గిన ధరల వివరాలను ప్రజలకు తెలియజేయాలని ఎంపిడిఒ సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ దిలీప్‌కుమార్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణానదికి భారీ వరద

(మొదటి పేజీ తరువాయి)

గంభీరంగా చెబుతున్నారు. ఆచరణలో అడుగు కూడా వేయడం లేదు. రెండు సొరంగాల తవ్వకం పనులు పూర్తయ్యాయి.రెండో సొరంగం లైనింగు పనులు ఆఖరుదశలో ఉన్నాయి. మొదటి సొరంగాన్ని నీటిని తరలించేలా అడ్డంకులు తొలగించాలి. సొరంగాల నుంచి రిజర్వాయర్‌కు వచ్చే కాలువ అనేక చోట్ల దెబ్బతిన్నది.దీన్ని రిపేర్లు చేసేందుకు ఇపుడు నిధులు మంజూరు చేసింది. ఈ పనులు పూర్తిచేయాలి. వచ్చే సీజన్‌కు సాధ్యమా?అంటే కష్టమే. పైగా నిర్వాసితులకు ప్యాకేజీలు ఇవ్వలేదు. వారు 7వేల మందికిపైగానే ఉన్నారు. వారికి డబ్బులు ఇచ్చి ఖాళీ చేయించాలి. ఈ ప్రక్రియ జరగాలి. ఇందుకు బారీగానే నిధులు కావాలి. వెయ్యికోట్లు వరకూ నిర్వాసితులకే ఇవ్వాలి. ఈ కాలయాపన ఎందుకో అంతుచిక్కడం లేదు. అసెంబ్లీలోనూ ఎవరూ వెలిగొండపై గళం విప్పలేదు. అందరూ సిఎం చంద్రబాబుకు భయపడుతున్నారు. నోరువిప్పడం లేదు. ఆయన దృష్టిలో ఇది ప్రాధాన్యతల్లో ఉందా?లేదా?అనేదీ స్పష్టత లేదు. ఇప్పటికీ పూర్తిచేసినట్లయితే ప్రస్తుత వరదనీటితో వెలిగొండ నిండిపోయేది. రైతుల కలలు సాకారం అయ్యేవి. ఇపుడా అవకాశం మరోసారి రైతులు కోల్పోయారు.

పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

పంటల పరిశీలన

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

రైతులందరూ తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి జవహర్‌లాల్ నాయక్ అన్నారు. మండలంలోని కటాకానిపల్లి గ్రామంలో మండల వ్యవసాయ అధికారి డి జవహర్‌లాల్ ఈ పంట నమోదు కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఖరీఫ్‌లో సాగు చేసిన ప్రతి పంటను డిజిటల్ క్రాప్ సర్వే తప్పనిసరిగా ప్రభుత్వం వారి ఆదేశాల మేరకు గడువు లోపల పూర్తి చేయాలని, ఆలా చేసిన రైతులకు మాత్రమే ప్రభుత్వం ద్వారా పథకాలు వర్తిస్తాయని తెలిపారు. కాబట్టి రైతులు తాము సాగు చేసిన పంటలను గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా పంటలను నమోదు చేసుకోవాలని, అలాగే కౌలు రైతులు గ్రామ రెవెన్యూ అధికారి వద్ద కౌలు కార్డు తీసుకొని పంట నమోదు చేపించుకోవాలని తెలిపారు. అనంతరం పత్తి, మిరప పంటలను పరిశీలించారు. రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఎం రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

ఎంపీడీవోను సత్కరిస్తున్న టిడిపి నాయకులు

ఎంపీడీవోకు టిడిపి నాయకుల సత్కారం

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

మార్కాపురం ఎంపీడీవో బాలచెన్నయ్యను టిడిపి మండల కమిటీ నాయకులు సోమవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలసి పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బాలచెన్నయ్య మాట్లాడుతూ మండల అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు రెండు కళ్లలాంటి వారని, వారి సహాయ సహకారాలతో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం మండల టిడిపి అధ్యక్షులు, కాకర్ల శ్రీనివాసులు, మిట్టమీదపల్లె సొసైటీ చెర్మన్ గొలమారి నాసర్ రెడ్డి, మండల ప్రదాన కార్యదర్శి మాకం అబ్రహాం, కొత్తపల్లె సర్పంచ్ మట్టం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ చేస్తున్న ఎరిక్షన్‌బాబు

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

అనారోగ్యంతో బాధపడుతూ వివిధ వైద్యశాలలో వైద్యం చేయించుకొని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 36 మందికి మంజూరైన రూ.26,39,242 విలువైన చెక్కులను స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఆపదలో అండగా నిలిచేది ముఖ్యమంత్రి సహాయ నిధి మాత్రమేనని అన్నారు. అనారోగ్యంతో వైద్యం చేయించుకున్న ఏ ఒక్కరు కూడా ఇబ్బంది పడకూడదనే ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని అన్నారు. లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి చంద్రబాబు అందించిన సహాయాన్ని మరువకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ చేకూరి సుబ్బారావు, టీడీపీ నాయకులు చిట్టేల వెంగళరెడ్డి, మంత్రునాయక్, పోట్లు గోవిందు, మేకల వలరాజు, బివి సుబ్బారెడ్డి, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

చైనా చారిత్రాత్మక నిర్ణయం

భారత ఫార్మా రంగానికి నూతన దశ

డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

భారతదేశం నుంచి ఎగుమతి అయ్యే ఫార్మా ఉత్పత్తులపై ఇప్పటివరకు అమల్లో ఉన్న 30 శాతం దిగుమతి సుంకాన్ని చైనా ప్రభుత్వం పూర్తిగా ఎత్తివేయడం శుభపరిణామమని ప్రముఖ రసాయన శాస్త్రవేత్త, ఎస్ఆర్సి ల్యాబరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి అభిప్రాయపడ్డారు. ఇకపై భారతదేశానికి చెందిన ఔషధ ఉత్పత్తులను ఎటువంటి దిగుమతి సుంకం లేకుండా చైనాకు ఎగుమతిచేసే అవకాశం లభించడం ద్వారా, భారత ఫార్మా పరిశ్రమకు కొత్త అవకాశాల ద్వారం తెరుచుకున్నట్టయిందని ఆయన అన్నారు. యుఎస్ మార్కెట్ ప్రస్తుతం ఖరీదైనదిగా మారుతున్న నేపథ్యంలో, చైనా తీసుకున్న ఈ నిర్ణయం భారత కంపెనీలకు ప్రత్యామ్నాయంగా బలమైన మార్కెట్‌గా నిలుస్తుందని తెలిపారు. ఈ నిర్ణయంతో భారత్-చైనా మధ్య వాణిజ్య సంబంధాలు మరింత మెరుగుపడటమే కాకుండా, భారతదేశ ఆర్థిక వృద్ధికి ఇది కొత్త ఊపును ఇస్తుందని ఆయన విశ్లేషించారు. ప్రపంచ ఆరోగ్య సంరక్షణ రంగంలో భారతదేశం ఇప్పటికే కీలక పాత్ర పోషిస్తున్నందున, చైనా ఇచ్చిన ఈ ఆర్థిక ప్రోత్సాహం ద్వారా భారత్ గ్లోబల్ హెల్త్‌కేర్ చైన్‌లో మరింత బలమైన స్థానం సంపాదిస్తుందని డాక్టర్ రామచంద్రారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. భారత ఔషధ పరిశ్రమ నాణ్యత, విశ్వసనీయత, సామర్థ్యం విషయాల్లో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ఇప్పుడు చైనా కూడా భారత ఫార్మా శక్తిని సమ్మతిస్తూ తీసుకున్న ఈ నిర్ణయం, ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాల అభివృద్ధికి దోహదం చేస్తుందని అన్నారు. ఈ నిర్ణయం వల్ల భారత ఔషధ కంపెనీలకు ఎగుమతుల పెరుగుదల, కొత్త పెట్టుబడుల అవకాశాలు, ఉద్యోగాల సృష్టి వంటి అనేక పాజిటివ్ ప్రభావాలు కనిపించనున్నాయని డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి వెల్లడించారు.

పాస్ పోర్ట్ పోయినది

మార్కాపురం పట్టణంలోని జవహర్ నగర్ కాలనీకి చెందిన పోరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, తండ్రి: కనకా రెడ్డి నకు సంబంధించిన పాస్ పోర్ట్ పోయినది. నెంబరు: E 5214154 ఇల్లు మారుతుండగా పోయినది. వెతికిన కనిపించలేదు. ఎవరికైనా దొరికిన యెడల అందజేయగలరని మనవి.

ఇట్లు
పోరెడ్డి వెంకటేశ్వర రెడ్డి
సెల్: 94402 66098.
మార్కాపురం.

డాక్యుమెంట్స్ పోయినవి

బాపట్ల జిల్లా అద్దంకి పురపాలక సంఘం పరిధిలోని 5 వ వార్డు నివాసం భైరపునేని శ్రీలత భర్త సురేష్ కు చెందిన రిజిస్టర్ దస్తావేజులు ఇంటి నుండి ద్విచక్ర వాహనంపై స్థానిక బస్టాండ్ సమీపంలో జిరాక్స్ సెంటర్ కు వెళ్తున్న సమయంలో నాకు సంబంధించిన రిజిస్టర్ దస్తావేజులు నెంబరు 2369/2012, 2370/2012 పోయినవి. దొరికిన వారు ఈ కింది చిరునామాకు తెలియపరచగలరని మనవి.

ఇట్లు
భైరపునేని శ్రీలత, భర్త సురేష్,
అద్దంకి పట్టణం, బాపట్ల జిల్లా,
సెల్ నెం 98496 24010.

డాక్యుమెంట్లు పోయినవి

పూనూరి ప్రభాకర్ రెడ్డి, తండ్రి పెద జడలరెడ్డి, గుండ్ల సముద్రం, మద్రిపూడి మండలం, ప్రకాశం జిల్లా అను నేను మరియు మా అత్తగారైన వల్లంరెడ్డి జడలమ్మతో కలిసి నా తమ్ముడు నివాసము ఒంగోలుకు వెళ్ళుదలిసి సుమారు మధ్యహ్నం 3 గంటల సమయములో ఒంగోలు వెళ్ళుటకు పొదిలి బస్టాండ్‌కి వచ్చి బస్సు ఎక్కే సమయంలో నా చేతిలో ఉన్న ప్లాస్టిక్ సంచి మరిచిపోయినాను. ఆ సంచిలో ఖాళీ సంతకము చేసిన ప్రాంశరి నోటు, కెనరా బ్యాంక్ 605681 To 605684 నెబర్లు గల సంతకం చేసిన చెక్కులు, ఆధార్ కార్డు మరియు పొలముకు సంబంధించిన ఒరిజినల్ కాగితములు పోయినవి. నేను మరల ఒంగోలు నుండి పొదిలి బస్టాండ్‌కు వెళ్ళి వెదకగా అగుపడలేదు. కావున పైతెలిపిన సంచి మరియు అందులోని కాగితాలు ఎవరికైనా దొరికిన యెడల నా యందు దయుంచి ఈ క్రింది ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి తెలియపరచవలసినదిగా మిక్కిలి ప్రార్థించడమైనది.

ఇట్లు
పూనూరి ప్రభాకర్ రెడ్డి,
గుండ్ల సముద్రం గ్రామం, మద్రిపూడి మండలం,
ప్రకాశం జిల్లా,
ఫోన్ నెం: 9573732974, 9642504890.

ఒరిజినల్ పాస్ పోర్టు పోయినది

బాపట్ల జిల్లా చీరాల మున్సిపల్ చీరాలలోని వుడ్ నగర్, హయ్యర్ పేట, ఉమా మహేశ్వర హాస్పిటల్ వెనుక డోరు నెం.22-4-34, కాపురస్థురాలు కోనా షణ్ముఖి గారి కుమార్తె కోనా రమ్య శ్రీ వయస్సు 28సం.లు (ఆధార్ నెం.20346034 2427) అను నేను స్వయముగా చెప్పి వ్రాయించి యిచ్చిన అఫిడవిట్టు.

నాకు పాస్‌పోర్ట్ నెం. T9927923 కలదు. సదరు పాస్ పోర్ట్ ది.23-09-2025వ తేదిన చీరాల మార్కెట్ సెంటరు వెళుతుండగా మార్గం మధ్యలో పోయినది. సదరు పాస్ పోర్ట్ ఎంత వెతికినను కనబడలేదు. కావున సదరు పాస్‌పోర్ట్ ఎవరికైనా దొరికిన ఎడల నా చిరునామాకు చేర్చవలసినదిగా ప్రార్థన. పైన పొందుపరచిన సంగతులన్నియూ నాకు తెలిసినంతవరకు యదార్థములని తెలియజేయుచున్నాను.

ఇట్లు
కోనా రమ్య శ్రీ, D/o. కోనా షణ్ముఖి
వుడ్ నగర్ హై హయ్యర్ పేట,
చీరాల, బాపట్ల జిల్లా.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No: 202/2021
I. A.No: 2224/2024

కొండ్రు రామాంజనేయులు మరియు కొందరు ...వాది
మరియు
నాగబోయిన శుభరాణి ...ప్రతివాది

To.
నాగబోయిన శుభరాణి, W/o. నాగభూషణం
R/o: D. No:8-23 K, 8th word,
మేదరమెట్ల గ్రామం, కొరిశపాడు మండలం,
బాపట్ల జిల్లా.

పై నంబరు దావాలో I.A తాలుకా మీకు ఎన్ని సార్లు సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారని శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వుల మేరకు మీరు 16.10.2025న ఉదయం 10.30 ని॥ల నుండి సాయంత్రం ఐదు గంటల లోపు పై కోర్టు వారి ఎదుట హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో దావాని మీకు పరోక్షంగా తీర్మానించబడును.

// శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వులతో//
మోతుకూరి సుభాష్ బాబు
మద్దినేని గృహలక్ష్మి
అడ్వకేట్స్, అద్దంకి

మహారాజశ్రీ కందుకూరు సీనియర్ సివిల్‌జడ్జి గారి కోర్టులో
I.A.No. 34 / 2025
O.S.No. 14 / 2017

బత్తుల తిరుపతయ్య, (Died)
వగైరాలు - పిటిషనర్లు / వాదులు
Vs
కల్లు రోశిరెడ్డి
వగైరాలు - రెస్పాండెంట్లు / ప్రతివాదులు

నోటీసు

22. మేడం కుమారి, భర్త పిచ్చిరెడ్డి,
పసుపుగల్లు గ్రామం, ముండ్లమూరు మండలం,
ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలో I.A.No.34/2025 నెంబరు పిటిషన్ ద్వారా మిమ్ములను ప్రతివాదులుగా చేర్చమని కోరుతూ దాఖలు చేయబడిన పిటిషన్ నందు మీ యొక్క నోటీసు నిమిత్తం శ్రీయుత కోర్టువారు **తే16-10-2025**దినకు వాయిదా వేసియున్నారు. సదరు వాయిదా రోజు అనగా **తే16-10-2025ది ఉదయం గం॥ 10.30 నిముషములకు** పైకోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని లేదా న్యాయవాది ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేది: **16-10-2025**
కోర్టువారి ఉత్తర్వుల మేరకు
కందుకూరు — **యం.మల్లికార్జునరావు**
30-09-2025 — బి.కాం., బి.యల్.,
పిటిషనర్లు తరపు న్యాయవాది

మహారాజశ్రీ ఒంగోలు రెండవ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
E.P.No: 1/2025 IN O.S.No: 52/2017

బిట్వీన్:
వీరిశెట్టి కృష్ణ ...డి. హెచ్. ఆర్
మరియు
1. పోలిశెట్టి మంజుల
2. పోలిశెట్టి మాధురి ...జె.డి. ఆర్స్

To.
JDR1) పోలిశెట్టి మంజుల,
భర్త పొత్తూరి రత్నంబాబు, వయస్సు 46 సంవత్సరాలు, హిందూ.
JDR2) పోటిశెట్టి మాధురి,
భర్త శికాకొల్లి శ్రీనివాస్, వయస్సు 40 సంవత్సరాలు, హిందూ.

పై వారి ఇద్దరి నివాసం డోర్ నెంబర్: 7-1-33, సాయిబాబా టెంపుల్, ఎదురులైను, హరే రామ బజార్, ఒంగోలు, ప్రకాశం జిల్లా.

పై నెంబర్ గల E.Pను మీపై దాఖలు చేసి మీకు ఎన్నిమార్లు E.P సమన్లు పంపిననూ చేరనందున ఈ ప్రకనట ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా పై నెంబరు E.Pలో మీకు నోటీసు నిమిత్తం తేది: 07-10-2025న వాయిదా అయిఉన్నది. కావున సదరు తేదిన ఉదయం గం. 10:30 ని॥లకు మీరు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొన వలసినది లేని యెడల మీ పరోక్షమునందు కేసును విచారించి తీర్మానించబడునని తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
వాయిదా తేది: 07-10-2025

ఇట్లు
పి.ఎస్.వి. సత్యనారాయణరెడ్డి,
అంగలకుర్తి కోటేశ్వరరావు,
బక్క ఝాన్సీ,
DHR తరపు న్యాయవాదులు,
ఒంగోలు.

ఉద్యోగుల హక్కుల కోసం సిఐటియు పోరాటం

జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి పిలుపు

ప్రజాశక్తి-దర్శి

నవంబరు 7 నుంచి 9 వరకు జరుగనున్న సిఐటియు ప్రకాశం జిల్లా 13వ మహాసభల ప్రచారాన్ని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికుల ఇంటింటికీ తీసుకుపోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి.కొండారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో వెల్లంపల్లి ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన మహాసభల ఆహ్వాన సంఘం కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులు, ఉద్యోగుల హక్కుల కోసం సిఐటియు పోరాడుతుందని ఆ పోరాటాలను ముందుకు తీసుకుపోయేందుకు దర్శిలో మూడు రోజుల పాటు జరిగే జిల్లా మహాసభలలో కార్యచరణ ప్రణాళిక రూపొందిస్తామన్నారు. మహాసభల జయప్రదం చేయడానికి ప్రజాసంఘాలతో ఆహ్వాన సంఘం ఏర్పడి కృషి చేయాలని కోరారు. కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ సిఐటియు మహాసభకి రైతులు, వ్యవసాయ కార్మికుల సహాకారం పూర్తిగా అందిస్తామన్నారు. దర్శిలో జిల్లా స్థాయి మహాసభ మొదటిసారిగా నిర్వహిస్తున్నామని ప్రజలందరూ తమ సహాయ, సహాకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిఐటియు దర్శి నియోజకవర్గ కార్యదర్శి తాండవ రంగారావు, మండల కన్వీనర్లు చిరుపల్లి అంజయ్య, ఉప్పు నారాయణ, బోడపాటి హనుమంతరావు, రైతు సంఘం నాయకులు పంటా ఏడుకొండలు, సందు వెంకటేశ్వరరావు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కెవి.పిచ్చయ్య, సిహెచ్.ఆదినారాయణ, గోగు వెంకయ్య, షేక్ కాలేభాషా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జివి కొండారెడ్డి

సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి

ప్రజా ఫిర్యాదుల వేదికలో కలెక్టర్ రాజాబాబు

ప్రజాశక్తి-కనిగిరి

ప్రజల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేస్తుందని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు తెలిపారు. సోమవారం కనిగిరిలోని పవిత్ర ఫంక్షన్ హాల్లో జరిగిన అర్జీల స్వీకరణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డితో కలసి పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మంచి చేయాలనే ఆలోచనతో ప్రజాప్రతినిధులు, అధికారులు కలసి సమస్యల పరిష్కార దిశగా పయనించాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. కనిగిరి రెవిన్యూ డివిజన్ పరిధిలో పిజిఆర్ఎస్ నిర్వహణకు శాసనసభ్యులు ఉగ్ర నరసింహరెడ్డి ఎంతో సహకరించారన్నారు. ఆయన ప్రోత్సాహంతో ప్రజలు చైతన్యంతో ముందుకు వచ్చి తమ సమస్యలను విన్నవించుకున్నారని తెలిపారు. కనిగిరి రెవిన్యూ డివిజన్ పరిధిలోనే 814 అర్జీలు నమోదు కావడం శుభ పరిణామన్నారు. కలెక్టర్ మన దగ్గరకు వచ్చారు. మన సమస్యలు తీరిపోతాయంటూ ఫిర్యాదుదారులే నేరుగా వచ్చి తమ వినతిపత్రాలను అందచేశారన్నారు. నమోదైన అర్జీలలో 60 నుంచి 70 శాతం రెవెన్యూ సంబంధమైన సమస్యలేనన్నారు. జిల్లా సంయుక్త కలెక్టర్, రెవెన్యూ అధికారులతో ప్రత్యేకంగా సమీక్షిస్తానన్నారు. అర్జీదారుల సమస్యలపై పరిశీలించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు. జీఎస్టీ పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన కరపత్రాలను ఎమ్మెల్యేతో కలిసి ఆయన ఆవిష్కరించారు.కలెక్టర్ వెంట కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఆర్డిఓ శ్రీ కేశ వర్ధన్ రెడ్డి, డి ఎల్ డి ఓ శ్రీనివాసరెడ్డి, తహసిల్దార్ ఏవి రవిశంకర్ పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే ఉగ్ర

పట్టణంలో భూఅక్రమణలపై సిట్ వేయాలి

కనిగిరి పట్టణంలో నిర్వహించిన ప్రజా సమస్యలా పరిష్కార వేదికలో ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు పీసీ కేశవరావు, కె ప్రసన్న సమస్యలపై వినతులు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనిగిరి పట్టణ పరిధిలో భూకబ్జాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని, వాగులు ఆక్రమిస్తున్నారని, సూరపాపిరెడ్డినగర్‌లో ప్రభుత్వ అవసరాలకు వదిలేసినా ప్లాట్లను అమ్మివేశారని, అక్రమ వెంచర్లు పుట్టగొడుగొల్లగా వెలుస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదు అని తెలిపారు. పట్టణంలో సాగర్ జలాలను పైప్‌లైన్ ద్వారా ప్రతి ఇంటికి అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు పి.నరేంద్ర, ఆర్.ఏడుకొండలు, ప్రభుదాసు, అడివయ్య, ప్రసంగి, చెన్నకేశవులు, ఆదిలక్ష్మి, రత్తమ్మ, టోపీవలి, షమీల, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, ఎమ్మెల్యే ఉగ్రతో కలసి సిహెచ్‌సిని సందర్శించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు. ఈయన వెంట జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా వెంకటేశ్వర రావు, ఆసుపత్రి వైద్యులు ఉన్నారు. అనంతరం కనిగిరి – పామూరు రోడ్డులోని నందితా శ్రీ నివేదిత శ్రీ డెవలపర్స్ లే అవుట్‌ను సందర్శించి సంబంధిత డెవలపర్స్ పిపిపి విధానంలో రిజిస్ట్రేషన్ కార్యాలయం నూతన భవనానికి ఉచితంగా స్థలం ఇవ్వడంతో పాటు ఉచితంగా నిర్మిస్తున్న భవనాన్ని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డితో కలసి పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వెంట ఆర్డీఓ కేశవర్ధన్ రెడ్డి, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న బైక్.. వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-పంగులూరు : డివైడర్‌ను బైక్ ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన పంగులూరు మండలంలోని జాగర్లమూడివారిపాలెం దగ్గర జాతీయ రహదారిపై సోమవారం రాత్రి చోటుచేసుకుంది. జాగర్లమూడి వారిపాలెంకు చెందిన తెలగతోటి రాఘవరావు సోమవారం రాత్రి మద్యం సేవించి, బండి నడుపుతూ సర్వీస్ రోడ్డులో వెళుతూ డివైడరును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రాఘవరావు తలకు బలమైన గాయాలయ్యాయి. గాయపడిన రాఘవరావును 108 అంబులెన్స్‌లో అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు రేణింగవరం ఎస్సై వినోద్ బాబు తెలిపారు.

కార్యదర్శిపై దాడి

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి మండలం గోసులవీడు పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ నారాయణ శానిటేషన్ కార్యక్రమం చేయుటకు గ్రీన్ అంబాసిడర్‌లను పిలిచి బ్లీచింగ్ పనులు చేస్తుండగా గ్రీన్ అంబాసిడర్‌గా ఉన్న ముద్దా కొండయ్య అనే వ్యక్తి కర్రతో దాడి చేయడం అమానుషం అని కనిగిరి తాలూకా ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షులు పిల్లి రమణారెడ్డి, కార్యదర్శి షేక్ హజరత్ అలీ దాడిని ఖండించారు. చట్ట వ్యతిరేకంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

ప్రజాశక్తి-కొండపి : అధిక ధరకు బ్యారేన్‌లను భూములను రైతులు కౌలుకు తీసుకోరాదని, ప్రత్యామ్నాయ పంటల వైపు పొగాకు రైతులు దృష్టి సారించాలని వేలం నిర్వహణ అధికారి జి.సునీల్ కుమార్ సూచించారు. సోమవారం స్థానిక పొగాకు వేలంకేంద్రంలో పెట్లూరు కస్టర్ పరిధిలోని రైతులకు పంట ఉత్పత్తి నియంత్రణ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఐటిసి లిమిటెడ్ ప్రతినిధి దినేష్, జిపిఐ లిమిటెడ్ అనిల్ కుమార్, పోలిశెట్టి కంపెనీ ప్రతినిధి లక్ష్మణ్, బోర్డు అధికారులు రైతులు సిబ్బంది పాల్గొన్నారు.

దర్శిలో పెరగనున్న వార్డులు

ప్రజాశక్తి-దర్శి : దర్శి పురపాలక సంఘంలో ప్రస్తుతం ఉన్న 20 వార్డుల నుంచి 27 వార్డులకు పెంచుతూ ప్రభుత్వం గజిట్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పురపాలక సంఘం కమిషనర్ వై.మహేశ్వరరావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు ప్రభుత్వ సంచాలకులు ఈ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆయన పేర్కొన్నారు. జీవో నెంబర్ 61 విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. కావున ఈ నోటిఫికేషన్ విడుదల ప్రకారం వార్డులు పెంచుతారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి షేక్ రహంతుల్లా, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రైతులకు టార్పాలిన్ పట్టలు పంపిణీ

ప్రజాశక్తి-దర్శి

రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని అధిక దిగుబడులు సాధించే విధంగా శాస్త్రవేత్తల కృషి చేయాలని ఆచార్య రంగ వ్యవసాయ విద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంను సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు వేరుశనగ వంగడాలు మరియు సాంకేతిక పరిజ్ఞానం గురించి క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని శాస్త్రవేత్తలకు సూచించారు. ఈ సందర్భంగా బంగరు కాలవపల్లి రైతులకు టార్పాలిన్ పట్టలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ సహాయ సంచాలకులు డాక్టర్ జాన్సన్, సమన్వయకర్త డాక్టర్ ఇ.చంద్ర, మధు, బాలాజీనాయక్, రైతులు పాల్గొన్నారు.

బ్రోచరు ఆవిష్కరిస్తున్న కావూరి వాసు, మార్నేని కృష్ణారావు,

మాట్లాడుతున్న అధికారులు

మాజీ ఎమ్మెల్యే ఎల్లయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి-చీమకుర్తి

నంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే దివంగత వేమ ఎల్లయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం సెంటర్లోని ఎల్లయ్య ప్రాంగణంలో వేమా ఎల్లయ్య 91వ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ శాసనసభ్యునిగా, ఎస్సీ ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్‌గా గతంలో వేమా ఎల్లయ్య అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జడ్పిటిసి వేమా శ్రీనివాసరావు, వైసీపీ మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు క్రిష్టిపాటి శేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ గంగిరెడ్డి ఓబుల్ రెడ్డి, బిసి సంఘాల నాయకులు టి గాంధీ, నాయకులు జి సుందర్ రామిరెడ్డి, బి కోటేశ్వరరావు, మొగిలిశెట్టి వెంకటేశ్వర్లు, పులి వెంకటరెడ్డి, ఎర్రగుంట్ల మోహన్, ఎస్ కే భాష, కూరాకుల సుబ్బారెడ్డి, వేమా ఎలమందయ్యా, బక్క సుధాకర్, రాజేంద్ర నాని తదితరులు పాల్గొన్నారు.

వేమా ఎల్లయ్య విగ్రహానికి వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

2న కల్యాణకట్ట ప్రారంభం

ప్రజాశక్తి-మద్దిపాడు

మల్లవరం వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన శ్రీవారి సదనం కళ్యాణకట్ట, వసతి గదులను అక్టోబర్ రెండవ తేది గురువారం విజయదశమి పర్వదినాన ప్రారంభిస్తున్నట్లు మల్లవరం శ్రీవారి వనం కమిటీ గౌరవ అధ్యక్షులు కావూరి వాసు, అధ్యక్షులు మార్నేని కృష్ణారావు తెలిపారు. సోమవారం ఒంగోలులో జరిగిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించి బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పురాతన ఆలయమైన వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం కళ్యాణకట్ట, శ్రీవారి సదనం, వసతి గదులను దాతల సహకారంతో ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు. శ్రీవారి వనం కమిటీ ద్వారా భక్తులు తల నీలాలు సమర్పించుకోవడం కోసం కేశఖండనశాల, గిరి ప్రదక్షణ వలయం, భక్తులు ఆకాంక్షల మేరకు ఆలయం ఉత్తరం వైపున నక్షత్ర వలయం రాశి వనము, దేవత వృక్షాలు, తదితర వాటిని అభివృద్ధి చెయ్యటం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతాల్లో పచ్చదనానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు పేర్కొన్నారు. రెండో తేదీ జరిగే ఉత్తర కార్యక్రమానికి ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని వారు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి బోయపాటి రవి, కోశాధికారి మన్నం శ్రీనివాస్ పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

ప్రజాశక్తి-పొన్నలూరు : పొన్నలూరు మండల పరిషత్ కార్యాల యంలో సోమవారం ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు అధ్యక్ష తన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాధవరావు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అందాలని, యూరియా ఒక్క టీడీపీ పార్టీ వాళ్లకే ఇస్తు న్నారని, ఒక పార్టీ వారికి కాకుండా మొత్తం రైతులకి యూరియా అందచేయాలని తెలిపారు. చెరుకూరు పిఎసిఎస్ చైర్ పర్సన్ వడ్డే మాల్యాద్రి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కౌలు రైతు పంటపై అవినీతి జరిగిందని సభలో ప్రశ్నించారు. కె.అగ్రహారం సర్పంచ్ షేక్ చిన్న మస్తాన్ మాట్లాడుతూ మాలకొండ దేవస్థానముకు ప్రతి శనివారం బస్సు సౌకర్యం కల్పించాలని రవాణా శాఖ అధికారులను కోరారు. ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్‌పర్సన్ కర్ణ తిరుపతమ్మ, జడ్పిటిసి బెజవాడ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీలు సర్పంచులు, పిఎసిఎస్ చైర్ పర్సన్స్ ఆయా శాఖ అధికారులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

కౌలు రైతు సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు నాగబోయిన రంగారావు

ప్రజాశక్తి - పంగులూరు

కౌలు వ్యవసాయం చేసే కౌలు రైతులందరికీ కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు కార్డులు ఇవ్వాలని, కౌలు రైతులందరికీ పంట రుణాలు ఇవ్వాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు నాగబోయిన రంగారావు డిమాండ్ చేశారు. స్థానికంగా సోమవారం జరిగిన మండల కౌలు రైతు సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 80శాతం వ్యవసాయం కౌలు రైతులు చేతుల్లోనే ఉందని చెప్పారు. అయితే కష్టపడి పంటలు పండిస్తున్న కౌలు రైతులకు ప్రభుత్వ సహకారం సక్రమంగా లేదని అన్నారు. ప్రభుత్వాలు మారిన, కౌలు రైతుల జీవన పరిస్థితి మారటం లేదని అన్నారు. ప్రభుత్వాలు భూ యజమాని అనుమతితోనే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆదేశిస్తూ వచ్చిందని అన్నారు. రైతు సంఘం పోరాటం ఫలితంగా భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చేందుకు ప్రభుత్వం అనుమతించిందని చెప్పారు. కౌలు రైతులు గుర్తింపు కార్డులు కోసం ప్రయత్నించాలని చెప్పారు. కౌలు రైతులందరికీ పంట రుణాలు ఇవ్వాలని అన్నారు. పంటలు పండించడం కోసం కౌలు రైతులు బయట ప్రైవేటు వడ్డీ వ్యాపారుల దగ్గర వడ్డీలకు తీసుకొచ్చి వ్యవసాయం చేస్తున్నారని అన్నారు. వ్యవసాయంలో ప్రతి ఏటా నష్టాలు రావటం వలన వడ్డీలు చెల్లించలేక, అప్పులు తీర్చలేక రైతులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. బ్యాంకులు కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలని అన్నారు. కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలో కౌలు రైతులంతా కలిసి హక్కుల సాధన కోసం పోరాడాలని చెప్పారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు మాట్లాడుతూ కౌలు రైతులకు రైతు సంఘం అండగా ఉంటుందని అన్నారు. కౌలు రైతులంతా పంట రుణాల కోసం, వ్యవసాయ పరికరాల కోసం, పంట నష్ట పరిహారాల కోసం ఉద్యమించాలని అన్నారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం మాజీ అధ్యక్షులు రాయని వినోద్ బాబు, సంఘం నాయకులు నాయపాము జాన్, రమేష్, ఉన్నాం అంజయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రైతు సంఘం మాజీ అధ్యక్షులు నాగబోయిన రంగారావు

మనువాదంపై మహోద్యమమే జాషువాకు నివాళి

ప్రజాశక్తి - చీరాల

మహాకవి గుర్రం జాషువా 130వ జయంతి సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన సభలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ సత్రం మల్లేశ్వరరావు, రిటైర్డ్ ఎసిపి కట్టా రాజ్ వినయ్ కుమార్ మాట్లాడారు. మనువాదంపై మహోద్యమమే జాషువాకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. జాషువా సాహితీ సమితి ఆధ్వర్యంలో యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బండి భిక్షాలు అధ్యక్షతన స్థానిక సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ ఆఫీసులో సభ నిర్వహించారు. మహాకవి జాషువా చిత్ర పటానికి గోసాల ఆశీర్వాదం పూలమాల వేసి నివాళులు అర్పించారు. సభలో పలువురు మాట్లాడుతూ కుల, మత అసమానతలపై అక్షర యుద్ధం చేసిన నవయుగ చక్రవర్తి గుర్రం జాషువా చిరస్మరణీయుడని అన్నారు. కుల, మత భేదాలు, పేదరికాన్ని తన గురువులుగా భావించి, వాటి మూలాలపై జాషువా కలం యుద్ధం చేశారని పేర్కొన్నారు. కర్మ సిద్ధాంతం పేరుతో కోట్లాది కష్టజీవులను అణచివేసిన మనువాద విష సంస్కృతిపై మహోద్యమం నిర్మించారని గుర్తు చేశారు. పాములకు పాలు పోసి, చీమలకు పంచదార చల్లే మనుషులున్న ఈ జగాన 'పేదవాడికి గంజి నీళ్లు కూడా ఇవ్వరు' అనే జాషువా కవిత్వ పంక్తులను ఉటంకిస్తూ ఆయన సామాజిక అన్యాయాలపై గళమెత్తిన గొప్ప యోధుడని అన్నారు. సామాజిక అసమానతలకు మూలమైన మనువాదానికి ప్రతినిధులుగా ఉన్నవారు నేడు కేంద్రంలో అధికారంలో ఉన్నారని ఆరోపించారు. కాగా చొప్పరపు ఎసోబు మాస్టారు టీమ్‌తో జాషువా సాహిత్య పద్యాలు ఆలపించడం ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శి ఎన్ బాబురావు, చేనేత జనసమాఖ్య నాయకులు మాచర్ల మోహన్‌రావు, కొత్తపేట మాజీ సర్పంచ్ చుండూరు వాసు, దాసరి ఇమ్మానియేల్, శ్రీధర్, జ్యోతి రమేష్, ధర్మారావు, డేవిడ్, కళ్యాణి, బ్రహ్మయ్య, నిరంజన్, బి సుబ్బారావు, డి నారపరెడ్డి, సిహెచ్ శ్రీను పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కట్టా రాజ్ వినయ్ కుమార్

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేద్దాం

- ప్రశాంతంగా ముగిసిన కౌన్సిల్ సమావేశం
- అజెండాలోని 35 అంశాలకు ఆమోదం
- హాజరైన శాసన సభ్యులు ఎంఎం కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

పురపాలక సంఘం అభివృద్ధికి కౌన్సిలర్లు అందరూ రాజకీయాలకు అతీతంగా సహకరించి ప్రజల సమస్యలు ఐక్యంగా స్నేహపూరిత వాతావరణంలో పరిష్కరిస్తూ పట్టణాన్ని అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఛైర్మన్ మించాల సాంబశివరావు అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అజెండాలోని 35 అంశాలను కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించారు. దీంతో కౌన్సిల్ సమావేశం ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ కొన్ని సందర్భాల్లో రాజకీయాలు పక్కనబెట్టి అభివృద్ధి కోసం కలిసి ముందుకు సాగాలన్నారు. ప్రస్తుతం చేపడుతున్న పనులే భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. చీరాల అభివృద్ధికి అందరూ సహకారం అందించాలని కోరారు. ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని చెప్పారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో నియోజకవర్గ అభివృద్ధి పనులపై తాను ప్రత్యేకంగా ప్రస్తావించానని తెలిపారు. కుందేరు వాగు ప్రక్షాళన, రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, తీర ప్రాంతంలో పర్యాటక కేంద్రాలు అభివృద్ధి చేసే అంశాలను సిఎం చంద్రబాబు నాయుడు ముందుంచినట్లు తెలిపారు. సిఎం వీటికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. సమావేశంలో కమిషనర్ అబ్దుల్ రషీద్, డిఈ రఘురాం, ఎఇ కిరణ్ కుమార్, మేనేజర్ శ్రీనివాసన్, సీనియర్ అసిస్టెంట్ సుచేంద్ర పాల్గొన్నారు.

కౌన్సిల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

పిహెచ్‌సిలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - ఇంకొల్లు

స్థానిక పిహెచ్‌సి ఆవరణలో మార్టూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరిండెంట్ డాక్టర్ అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంకొల్లు రోటరీ క్లబ్ సహకారంతో రక్త దాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 19 మంది దాతలు రక్త దానం చేశారు. దాతలకు రోటరీ క్లబ్ ప్రతినిధులు పండ్లు, పండ్లరసాలు అందచేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు బలగం కోటేశ్వరరావు, కార్యదర్శి అలవల రాఘవరెడ్డి, కోశాధికారి గోరంట్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరంలో పాల్గొన్న వైద్యులు

మాట్లాడుతున్న కమిషనర్ కె సాంబశివరావు

జీఎస్టీపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - రేపల్లె

స్థానిక మునిసిపాలిటీలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై మున్సిపల్ కమిషనర్ కె సాంబశివరావు అవగాహన సదస్సు నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల భారత ప్రభుత్వం ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం జీఎస్టీ కౌన్సిల్‌లో తీసుకున్న నిర్ణయం ప్రకారం వివిధ గృహోపకరణ వస్తువులు, మందులు, ఆటో మొబైల్స్, నిర్మాణ సామాగ్రిపై జీఎస్టీ పన్ను గణనీయంగా తగ్గించాయని అన్నారు. సెప్టెంబర్ 22, నుండి అమలులోకి వచ్చాయని అన్నారు. జీఎస్టీ తగ్గిన విషయం ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రతి ఇంటికి తిరిగి ప్రతి పౌరునికి తెలియజేయాలని సిబ్బందికి తెలిపారు.

సర్పంచికి పరామర్శ

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

సిఎం చంద్రబాబు, ఎమ్మెల్యే బాలక్రిష్ణపై సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారనే ఆరోపణలతో అక్రమ కేసులు పెట్టి పోలీసులు అరెస్టు చేసిన ద్రోణాదుల సర్పంచ్ వంకాయలపాటి భాగ్యరావు బెయిల్‌పై విడుదలైన సందర్భంగా వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి అంజనీ ప్రసాదరెడ్డి పరామర్శించారు. దళితులతో చెలగాటం ఆడుతున్న కూటమి ప్రభుత్వం వచ్చే ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించిన డిజిటల్ డైరీలో నమోదైన మొదటి వ్యక్తిగా సిఐ మాదినేని శేషగిరిరావు అరుదైన ఘనత సాధించారని అన్నారు. పోలీసుల తీరు మార్చుకొని చట్టబద్ధంగా వ్యవహరించాలని కోరారు.

విద్యార్థికి నగదు అందజేస్తున్న రోటరీ సభ్యులు

పేద విద్యార్థికి ఆర్థిక చేయూత

ప్రజాశక్తి - పర్చూరు

ఇంజనీరింగ్ చదువుతున్న పేద విద్యార్థికి దాత సహకారం అందించగా రోటరీ క్లబ్ సభ్యులు ఆర్థిక చేయూత సోమవారం అందించారు. మండలంలోని జాగర్లమూడికి చెందిన పేద విద్యార్థి పల్లపు బాలాజీకి రూ.40వేలు ఆర్థిక సహాయం నగదు అందజేశారు. ఈ నగదును కొల్లా సాంబశివరావు సమకూర్చినట్లు రోటరీ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ తెలిపారు. విద్యార్థి బాగా చదివి, అభివృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి కోమటి ఆంజనేయులు, మానికొండ శ్రీనివాసరెడ్డి, ఎజి నాగభైరు శ్రీనివాసరావు, బాలాజీ పాల్గొన్నారు.

కొల్లూరులో నీట మునిగిన పంట పొలాలు

నీట మునిగిన పంటలు

ప్రజాశక్తి - కొల్లూరు

ప్రకాశం బ్యారేజీ నుండి కృష్ణా నదికి 6.85లక్షల క్యూసెక్కులు నీరు వదలడంతో కృష్ణ నది పరివాహక ప్రాంతాల్లోని పంట పొలాలు పూర్తిగా నీటిలో మునిగాయి. గతేడాది వచ్చిన వరదల వల్ల నష్టాల నుంచి కోలుకోని కౌలు రైతులు, రైతులు ఈ ఏడాది అప్పులు తెచ్చి రూ.వేలు ఖర్చు చేసి కంద, పసుపు, తమలపాకు పైర్లు వేసుకుంటే ఈ ఏడాది కూడా రైతన్నకు నిరాశే మిగిలింది. గతేడాదిలో చేసిన అప్పులే తీరక ఇబ్బందుల్లో ఉన్న రైతన్నకు ఈ వరదలతో పూర్తిగా అప్పుల్లో కూరుకు పోయి రైతు కోలుకునే పరిస్థితిలో లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నీరు పోయిన తర్వాత మరల పొలాలు దున్ని వేరే పైర్లు వేయాలన్న రూ.వేలల్లో ఖర్చు అవుతుంది. అప్పులు తేలేక మరల పైర్లు వెయ్యలేక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దెబ్బతిన్న పైర్లను రెమ్యునరేషన్ చేసి వెంటనే రైతులకు డబ్బులు విడుదల చేస్తే రెండో పంట వేసుకోగలమని రైతులు కోరుచున్నారు. ఈ విధంగా ప్రతి ఏటా వరదలు వస్తే పంటలు పండించలేమని రైతులు చెబుతున్నారు. ఏదేమైన ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న దృశ్యం

వధూవరులకు ఆశీర్వాదం

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని పూనూరుకు చెందిన వైసిపి నాయకులు బొందు ఆనందరావు (లేటు) ఆవంతి దంపతుల కుమారై జోసఫ్ హదస్సా వెడ్స్ వంశీకృష్ణ వివాహ రిసెప్షన్‌కు హాజరై నూతన వధూవరులను వైసిపి మండల కన్వీనర్ రావూరి వేణుబాబు, వైసిపి యువజన విభాగ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ఉప్పలపాటి అనిల్ చౌదరి, వైసిపి వాణిజ్య విభాగ అధ్యక్షులు ముప్పల రాంబాబు, ఎంపిపి కుమారుడు పులగం చందు, పూనూరు సర్పంచ్ మేకా సుధాకర్, నల్లపునేని లక్ష్మయ్య, షేక్ బుడే, వైసిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు యన్నం శ్రీను, ఆర్‌టిఐ అధ్యక్షులు కుంచపు అంకమ్మ, యద్దనపూడి సొసైటీ మాజీ ప్రెసిడెంట్ నల్లపునేని వీరయ్య, గడ్డం హనుమంతరావు, యద్దనపూడి వైసిపి నాయకులు నల్లపునేని వేణు, వందనం, గొర్రె సురేష్, పూనూరు వైసిపి నాయకులు ఆశీర్వదించారు.

జీవనశైలిలో మార్పులతో

గుండె జబ్బుల నివారణ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి ఒంగోలు కలెక్టరేట్

జీవన శైలిలో మార్పులు, వైద్యుల సలహాల మేరకు గుండె జబ్బుల నుంచి బయట పడవచ్చని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు తెలిపారు. చిన్న వయసులోనే గుండె జబ్బుల బారిన పడి మరణించడం బాధాకరమన్నారు. వీటిని అందరూ అధిగమించాలని సూచించారు. ప్రపంచ హృదయ దినోత్సవం పురస్కరించుకొని జీజీహెచ్‌లో కార్డియాలజీ విభాగం ఇన్‌ఛార్జి, విభాగాధిపతి డాక్టర్ కె. వెంకటేశ్వరరావు అధ్యక్షతన సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జీజీహెచ్‌లో ఆధునిక క్యాత్ ల్యాబ్ రావడం, తద్వారా గుండె సంబంధిత ఆంజియో పరీక్షలు చేయడం శుభపరిణామని తెలిపారు. బైపాస్ సర్జరీలు చేసే స్థాయికి జిజి హెచ్ ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. జిజిహెచ్‌కు ఓ పి పెరిగిందని, సౌకర్యాల కల్పనలో ఏలోటూ లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాణిక్యరావు మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం అనేరకాలుగా నిధులు కేటాయించ గా పలు పరికరాలు కొనుగోలు చేశామన్నారు. ఇటీవలే పల్మనలజి, ఓబి జి విభాగాల్లో రూ. 60 లక్షల విలువైన పరికరాలు సమకూర్చుకున్నట్లు తెలిపారు. దాతల సహకారంతో ఎమ్మెల్యే చొరవతో పేషెంట్లకు అవసరమైన వీల్‌చైర్స్ ఇతర అవసరాలు తీర్చే అవకాశం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటర్ కె.అద్దయ్య, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్ కుమార్, సిఎస్ఆర్ ఎంఒ డాక్టర్ మాధవీ లత, వైద్యులు పాల్గొన్నారు. అనంతరం పేషంట్ల వారి వారి సహాయకుల కోసం ఏర్పాటు చేసిన 18 మూడు సీట్ల బెంచీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. సిబ్బందికి సిపిఆర్ చేసే విధానం పై శిక్షణ ఇచ్చారు. కార్డియాలజీ విభాగంలో వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఇహెచ్ఎస్ కార్డుల్లో లోపాలు

సరిదిద్దేందుకు చర్యలు

ఎన్ఆర్ వైద్యసేవా ట్రస్ట్ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ హేమంత్

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

హెల్త్ కార్డులకు బయోమెట్రిక్ తిరకాసు అనే కథనం ఇటీవల ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైంది. ఈ కథనంపై డాక్టర్ ఎన్ఆర్ వైద్యసేవా ట్రస్ట్ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ పి. హేమంత్ స్పందించారు. ఇహెచ్ఎస్ ఆరోగ్య కార్డుల ఆధారంగా జిల్లాలోని నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో లబ్ధిదారులకు యథావిధిగా ఓపి మరియు ఐపి రిజిస్ట్రేషన్లు జరుగుతున్నట్లు తెలిపారు. ఆసుపత్రులు ఏవైనా అనవసర ప్రీ ఆథరైజేషన్స్ చేయకుండా ఉండేందుకు పేషెంట్ మరియు హాస్పిటల్ మెడికోల బయోమెట్రిక్ ధృవీకరణ తప్పనిసరి చేసినటుల తెలిపారు. కొంతమంది లబ్ధిదారులు బయోమెట్రిక్ సంబంధిత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వారి ఇహెచ్ఎస్ లాగిన్‌లో ఆధార్ అప్డేట్ చేసుకోవడం ద్వారా సమస్య పరిష్కారం అవుతుందని వివరించారు. ఈ విషయాన్ని వైద్యమిత్రలు, ట్రస్ట్ టీమ్ లీడర్లు, జిల్లా కార్యాలయం మరియు పత్రిక ప్రకటనల ద్వారా ప్రభుత్వ ఉద్యోగులకు ఇప్పటికే తెలియజేశామని ఆయన పేర్కొన్నారు. కొన్ని సాంకేతిక లోపాల విషయాన్ని ట్రస్ట్ ఇహెచ్ఎస్ విభాగానికి మరియు టెక్నికల్ టీమ్‌కు తెలియజేశామని, వీటిని తొందరగా సరిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని డాక్టర్ హేమంత్ కుమార్ తెలిపారు.

ప్రజాశక్తి కథనానికి స్పందన

నిత్యావసరాల ధరలు నియంత్రించాలి

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

నిరంతరం పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం జిల్లా అధికారులకు గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ ఆహార భద్రత చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయలన్నారు. రేషన్ దుకాణాల ద్వారా 14 రకాల సరుకులను ప్రజలకు చౌక ధరల దుకాణాల ద్వారా అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ప్రస్తుతం రేషన్ షాపుల్లో కేవలం బియ్యం, పంచదార తప్ప మిగతా నిత్యావసర సరుకులు ఇవ్వక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సన్న బియ్యం రేషన్ షాపుల ద్వారా సరఫరా చేస్తే అక్రమాలు తగ్గుతాయని తెలిపారు. ధరల పెరుగుదలతో పౌష్టికాహారం అందక మహిళలు, చిన్నారులు రక్తహీనతతో బాధ పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నగర కార్యదర్శి జి.ఆదిలక్ష్మి, సహాయ కార్యదర్శి కె. రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వినతి పత్రం అందజేస్తున్న ఐద్వా నాయకులు

అర్జీలు గడువులోపు పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్‌హాల్‌లో ఇన్‌ఛార్జి సంయుక్త కలెక్టర్ గంగాధర్ గౌడ్, డిఆర్‌డిఎ, స్త్రీ శిశు సంక్షేమ శాఖల పీడీలు, ఆర్‌డిఒలతో కలిసి అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలకు సంబంధించి ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో అందజేసిన అర్జీలను అధికారులు పరిశీలించి పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం అందించే వివిధ రకాల పింఛన్లు ప్రతి నెలా 1వ తేదీనే వంద శాతం పంపిణీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి నెలా 28 న ఉదయం 10.30 గంటలకు పింఛన్లు, పౌర సరఫరా శాఖ ద్వారా నిత్యావసర వస్తువుల పంపిణీ పై సమావేశం సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. నియోజకవర్గాలలో స్థానిక ఎమ్మెల్యేల ద్వారా పింఛన్లు పంపిణీ చేయాలన్నారు. లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఆప్యాయంగా పలకరిస్తూ వారికి పింఛన్లు అందజేయాలన్నారు. నియోజకవర్గ స్థాయి, రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, మండల కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి నెలా 28వ తేదీకల్లా అంగన్‌వాడీ కేంద్రాలకు రేషన్ బియ్యంతో పాటు ఇతర మిగిలిన వస్తువులు పంపిణీ జరిగేలా డిఎస్‌ఒ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి మల్లికార్జున రావు, డిఆర్‌డిఎ ఇన్‌ఛార్జి పీడీ లవన్న,స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ రాధామాధవి, డిఎఫ్ఓ రవి శంకర్,డిపిఒ ప్రభాకర్‌రావు, సిపిఒ.ఏ.ఎస్.రాజు, డిఇఒ పురుషోత్తం,డ్వామా పీడీ విజయలక్ష్మి, డి ఎం అండ్ హెచ్ఒ డాక్టర్ విజయమ్మ, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు కలెక్టరేట్ : ప్రజలనుంచి వస్తున్న అర్జీలను పునరావతం కాకుండా అధికారులు నాణ్యతతో పరిష్కరించాలని సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. సంయుక్త కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహించారు. జిల్లా నలమూలల నుంచి వచ్చిన అర్జీదారులు వినతి పత్రాల ద్వారా తమ సమస్యలను అధికారులకు విన్నవించారు. తన పరిధిలో ఉన్న వాటికి వీక్షణ సమావేశం ద్వారా మండల స్థాయి అధికారులతో ఆయన మాట్లాడి అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపారు. కొన్నిటిని పరిశీలన, మరికొన్నిటిని విచారణకు ఆదేశించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ నాణ్యతతో పరిష్కరించకపోతే ప్రజల అర్జీలు పునరావతం అయ్యే అవకాశం ఉందన్నారు. 227 అర్జీలు ఆయా శాఖలలో పునరావతం అయ్యాయన్నారు. నిబంధనల ప్రకారం సరైనవో కావో చూడాలన్నారు. లేకుంటే అర్జీదారులకు వివరించాలన్నారు. బాధితులకు అన్యాయం జరిగితే అలాంటి వారికి కచ్చితంగా న్యాయం జరిగేలా చూడాలన్నారు. గడువులోపు అర్జీలను పరిష్కరించే బాధ్యత అధికారులపై ఉందన్నారు. గడువు తీరిన అర్జీలు 15 ఆయా శాఖలలో పెండింగ్‌లో ఉండడంపై ఆరా తీశారు. గడువులోగాపు అర్జీలకు పరిష్కారం చూపాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ కళావతి, ఉప కలెక్టర్లు వరకుమార్, మాధురి, విజయ జ్యోతికుమారి, అధికారులు పాల్గొన్నారు.

బాపట్లలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్ కుమార్

ఒంగోలులో అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ

బోర్డు ఆఫ్ స్టడీస్ సభ్యురాలిగా చెంచులక్ష్మి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఆంధ్ర కేసరి యూనివర్సిటీ (ఎకెయు) విద్యా విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ (బోస్) సభ్యురాలిగా బాపట్ల జిల్లా వేటపాలెం మండలం, పందిళ్లపల్లి గ్రామానికి చెందిన పర్వతరెడ్డి చెంచులక్ష్మి నియ మితులయ్యారు. ఒంగోలు కేంద్రంగా మూడేళ్ల క్రితం ఏర్పడిన ఎకెయుకు సంబంధించి ఇటీవలే రెండు సంవత్సరాల కాలపరిమితితో బోస్ కమిటీని యూనివర్సిటీ అధికారులు సోమవారం ప్రకటించారు. చెంచు లక్ష్మి స్వగ్రామం బాపట్ల జిల్లా. ఆమె చీరాల పట్టణంలోని రవీంద్ర భారతి కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో ఇటీవల బిఎడ్ పూర్తి చేశారు. మెరిట్ విద్యార్థుల విభాగంలో ఆమెకు ఈ అవకాశం దక్కింది.ఎకెయు కళాశాల ఎంఎడ్ విద్యార్థి ఎస్. భరద్వాజ సాయి వివేక్ పీజీ విభాగం తరఫున ఎంపికయ్యారు. బోర్డు ఆఫ్ స్టడీస్ కమిటీ రెండేళ్లపాటు సిలబస్ రూపకల్పన, మాదిరి ప్రశ్నపత్రాల తయారీ, ప్రయోగ పరీక్షల నిర్వహణలో యూనివర్సిటీకి సహకరించనున్నారు. తన ఎంపిక సందర్భంగా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డివిఆర్.మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు, అకడమిక్స్ విభాగం డీన్ డాక్టర్ కే.గంగాధర్‌కు చెంచు లక్ష్మి కతజ్ఞతలు తెలిపారు.

వికసిత్ భారత్ క్విజ్‌లో పాల్గొనాలి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

వికసిత్ భారత్-2047 దిశగా యువత ఆలోచనలు, నాయకత్వాన్ని ప్రతిబింబించేందుకు కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్-2026ను జాతీయ యువజనోత్సవం భాగంగా నిర్వహించనున్నట్లు స్టెప్ ముఖ్యకార్య నిర్వహణాధికారి పి. శ్రీమన్నారాయణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.15-29 ఏళ్ల మధ్య వయస్సు గల యువత మై భారత్ పోర్టల్ ద్వారా అక్టోబర్ 15 లోపు వికసిత్ భారత్ క్విజ్‌లో తప్పనిసరిగా పాల్గొనాలని ఆయన కోరారు. ఎలాంటి రుసుం లేకుండా యువతకు వినూత్న ఆలోచనలు ప్రదర్శించే వేదికగా ఇది ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు.

అందుబాటులో యూరియా

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

జిల్లాలో 325 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, అవసరమైన రైతులు తీసుకెళ్లవచ్చునని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. బాపట్ల జిల్లా లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆర్ఎస్‌కె లు, పిఎసిఎస్ కేంద్రాల ద్వారా 248 మెట్రిక్ టన్నుల యూరియాను 2,935 మంది రైతులకు సోమవారం పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఇంకా 325 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటు లో ఉందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సి అవసరం లేదని తెలిపారు.

భైరవకోనలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి- సీఎస్‌పురంరూరల్

ప్రముఖ పుణ్యక్షేత్రమైన భైరవకోనలో నిర్వహిస్తున్న దసరా నవరాత్రి ఉత్సవాలలో మండలంలోని పలువురు నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ ముప్పాళ్ళ శ్యాంసుందర్ రాజు, ఈవో డి.వంశీకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరిగాయి. మహిషాసురమర్దిని దేవి అలంకారంలో త్రిముఖ దుర్గాదేవి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. షీప్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు తోడేటి గోపి, వైస్ ఎంపీపీ భూమిరెడ్డి ప్రభంజన వెంకటరెడ్డి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల నారాయణరెడ్డి, సర్పంచ్ భారతిరెడ్డి దంపతులు, కొత్తపల్లి, అంబవరం సర్పంచ్‌లు ముప్పాళ్ళ శ్యామలమ్మ, కొండూరి కొండయ్య, వెంకట రాజు, గుంటిమడుగు వెంకట కృష్ణంరాజు కుటుంబ సభ్యులతో కలిసి పూజలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాగితాలకే పరిమితమైన కృష్ణానది కరకట్ట

- ప్రతి ఏటా అధికారులకు తప్పని తిప్పలు
- ఐదేళ్లుగా వైసిపి ప్రభుత్వ నాన్చివేత ధోరణి
- ఏడాది కాలంగా కూటమి సర్కారుదీ అదే తీరు

ప్రజాశక్తి - రేపల్లె

కృష్ణా నది కరకట్టల పునరుద్ధరణ అంశాన్ని గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఏడాది కాలంగా కూటమి సర్కారు దీ అదే తీరు. కరకట్టల పటిష్టానికి కనీస చర్యలు తీసుకోలేదు. దీంతో వరద వస్తే బలహీనపడిన కరకట్టల కారణంగా ఎలాంటి విపత్తు వస్తుందోనని లంక, పల్లపు గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రకాశం బ్యారేజీ నుండి కిందటి ఏడాది సెప్టెంబరులో 11.40 లక్షల క్యూసెక్కుల భారీ వరద వచ్చింది. భవిష్యత్తులో 15లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదని నిపుణులు సూచిస్తున్నారు. తాజా వరదలకు తగ్గట్టుగా కట్టలను పునరుద్ధరించడం అత్యవసరం. జలవనరుల శాఖ తమ సాధారణ నిధుల నుంచి పనులు చేసేందుకు ప్రతిపాదనలు పంపుతున్నా నిధులు లేక ఆర్థిక శాఖ మోకాలడ్డుతోంది. వరదల వల్ల అతలా కుతలం అవుతున్న ఈ కరకట్టలకు విపత్తు నిధులను అనుసంధానం చేసి పనులు చేపట్టే అవకాశం ఉందని ఆర్థిక శాఖ అధికారులు చెబుతున్నారు. ఆ మేరకు జలవనరుల శాఖ ప్రతిపాదనలు పంపితే మేలు జరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పర్యాటకానికి ప్రాధాన్యం ఇస్తున్న కూటమి ప్రభుత్వం ఈ మార్గాలపై దృష్టి సారించాల్సి ఉంది. కరకట్టల పటిష్టానికి చర్యలు తీసుకుంటే పర్యాటకం అభివృద్ధికి ఇది తోడ్పడుతుంది.

15ఏళ్లుగా కరకట్టపై కన్నెత్తి చూడని అధికారులు

గత 15 ఏళ్లుగా పాలకుల నిర్లక్ష్యం కారణంగా కృష్ణా నది కరకట్ట విస్తరణ జరగలేదు. వరదలు సంభవించినప్పుడు

కృష్ణ కరకట్ట సమీపంలో వరద ఉధృతి దృశ్యం

అధికారులు, ప్రజాప్రతినిధులు హడావుడి చేస్తారే తప్ప కరకట్ట అభివృద్ధి వైపు కన్నెత్తి చూడటం లేదు. ఏళ్ల తరబడి వరదలు సంభవించినప్పుడు కరకట్ట మీద అధికారులు కాపలా కాయాల్సిందే. కలెక్టర్ సహితం కరకట్ట వెంబడి పర్యటిస్తున్నారే తప్ప దీని మీద దృష్టి సాధించడం లేదు. ప్రతి ఏటా కృష్ణా నదికి వరద సంభవించడంతో అటు లంక గ్రామాలు ప్రజలకు పాడి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. 2009లో కృష్ణా నదికి సంభవించిన వరదకు ఓలేరు, పల్లెపాలెం వద్ద కరకట్టకు గండిపడి రేపల్లె, భట్టిప్రోలు మండలాల్లో గ్రామాలు దెబ్బతిన్నాయి. గత అనుభవాలు దృష్టిలో ఉంచుకొని అప్పటి ప్రభుత్వం కృష్ణా నదికి ఇరువైపులా ఉన్న కరకట్టను అభివృద్ధి పర్చి వరదలు తట్టుకునే విధంగా కట్ట ఎత్తు పెంచి దానిపై డబల్ లైన్ రహదారిని ఏర్పాటు చేయాలని భావించారు. విజయవాడ నుండి పెనుమూడి వరకు 58 కిలోమీటర్లు ఉంది. రూ.111 కోట్లు, విజయవాడ నుండి పులిగడ్డ వైపు 58 కిలోమీటర్లు ఉంది. రూ.113 కోట్లు వరకు కరకట్ట అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టారు. ఈ నిధులతో కరకట్ట కొంతమేర అభివృద్ధి పరిచారు. రూ.కోట్ల ప్రతిపాదనలో ఉన్నప్పటికీ అడుగు ముందుకు పడటం లేదు. కానీ కొన్ని సాంకేతిక కారణాలు కోర్టు కేసులు, భూ సేకరణ జరగకపోవటంతో పెనుమూడి వైపు కరకట్ట పనులు కొంతమేర మిగిలిపోయాయి. విజయవాడ వారధి నుండి పెద కొండూరు వరకు రహదారి నిర్మించి అక్కడ నుండి కిలోమీటరు మేర పనులు నిలిచిపోయాయి. ఈ ప్రాంతంలో కిలోమీటర్ వరకు కరకట్ట ప్రక్కనున్న రైతు భూ సేకరణ వ్యతిరేకించడంతో పనులు నిలిచిపోయాయి. అక్కడి నుండి కొల్లూరు వరకు కరకట్ట అభివృద్ధి పరచి డబల్ లైన్ నిర్మాణం చేపట్టారు. కొల్లూరు లాక్ సెంటర్ నుండి దోనేపూడి వరకు కట్ట అభివృద్ధిపరిచి రహదారి నిర్మించారు. తిరిగి మరల దోనేపూడి నుండి భట్టిప్రోలు మండలం పెదపులివర్రు వరకు కోర్టు కేసులతో కరకట్ట పనులు నిలిచి పోయాయి. పెదపులివర్రు బయట నుండి రేపల్లె మండలం రావి అనంతవరం బైట వరకు రహదారిని విస్తరించి ఎత్తు పెంచి రహదా నిర్మించారు. అక్కడి నుండి అర కిలోమీటర్ బ్రిడ్జి వరకు పనులు నిలిచిపోయాయి. కరకట్ట రహదారిని విస్తరించి ఎత్తు పెంచి అభివృద్ధి పర్చినప్పటికీ ఓలేరు, పల్లెపాలెం వద్ద 2009లో సంభవించిన వరదకు గండిపడిన ప్రాంతంలో రహదారి కృంగిపోయి పల్లపు ప్రాంతంగా ఉంది. ఈ ప్రాంతంలో గతేడాది లాగే ఈ ఏడాది కూడా గండిపడి నీరు పారుతుందని భావనతో అధికారులు, గ్రామస్తులు సంచుల్లో మట్టిని నింపి కరకట్టపై గోడగా నిర్మిస్తున్నారు. పెనుమూడి వైపు ఉన్న కరకట్ట పటిష్ట పరిస్తే వరద ముంపును తట్టుకోవడమే కాకుండా నాలుగు నియోజకవర్గాల ప్రజల రవాణాకు అనుకూలంగా ఉంటుంది. లంక గ్రామాల ప్రజలుకు ఇటు నిజాంపట్నం పోర్ట్ మత్స్య సంపదకు రవాణాకు ఇది ప్రధానమైనది. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి కృష్ణానది కరకట్ట అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.



చెక్కు పంపిణీ చేస్తున్న నరేంద్ర వర్మ

వీధి వ్యాపారుల ఉపాధికి స్వానిధి

ప్రజాశక్తి - బాపట్ల

ప్రధాన మంత్రి స్వానిధి ద్వారా వీధి వ్యాపారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మెప్మా ఆధ్వర్యంలో 50 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.7.27కోట్లు, మరో 100 మంది వీధి విక్రయ దారులకు పిఎం స్వానిధి పథకం క్రింద రూ.50 లక్షల రుణాల చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, సిఎంఎం నర్రా సుబ్రహ్మణ్యం, టిడిపి పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ మందపాటి ఆంధ్రయ, బ్యాంకుల మేనేజర్లు, మెప్మా ఆర్పీలు, డ్వాక్రా సంఘాల మహిళలు, వీధి విక్రయ దారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ శ్రీహర్ష

మహిళల ఆరోగ్యం కుటుంబ బలం

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలో వింజనంపాడులో స్వస్థ నారి స్వశక్తి పరివార అభియాన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీహర్ష అధ్యక్షత వహించి మాట్లాడారు. వ్యాధులకు దూరం కావాలి అంటే పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. గ్రామంలో ఆరోగ్య సిబ్బంది బృందాలుగా గ్రామం మొత్తం తిరిగి సుమారు 220 మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. వైద్యాధికారి గ్రామ ప్రజలకు సాధారణ పరీక్షలు చేశారు. వ్యాధులపై సర్వే చేశారు. ఎన్‌సిడి 4 సర్వే చేశారు. కార్యక్రమంలో సిహెచ్ఒ చంద్రశేఖర్, హెచ్ఎస్ నాగేశ్వరరావు, హెచ్‌వి సునంద, హెచ్ఎ కోటేశ్వరరావు, నాయకులు సుధీర్, నాగరాజు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ బుక్ ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

డిజిటల్ బుక్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పంగులూరు

మండల కేంద్రమైన పంగులూరులో వైసిపి నాయకులు డిజిటల్ బుక్కును సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైసిపి మండల కన్వీనర్ రావూరి శ్రీనివాసరావు మాట్లాడారు. వైసిపి ఇన్చార్జి డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ ఆదేశాల మేరకు డిజిటల్ బుక్ ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. వైసిపి కార్యకర్తలపై అధికార పార్టీ అనేక దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతుందని, వీటిని ఎదుర్కొనేందుకు కార్యకర్తలంతా డిజిటల్ బుక్కు ఉపయోగించు కోవాలని కోరారు. అనంతరం డిజిటల్ బుక్కును ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసిపి రైతు విభాగం ఉపాధ్యక్షులు తోట రామాంజనేయులు, నాగబోయిన తిరపతయ్య, పులికండం సుబ్బారెడ్డి, అంకిరెడ్డి రంగారావు, చిలుకూరి సాంబశివరావు, బాచిన శ్రీనివాసరావు, గొల్లపూడి నాగేశ్వరరావు, మోరబోయిన అంజనేయులు, జంపాని రాజా, మందాపూర్ణోత్తం, పాలపర్తి అశేంద్ర పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి చూపాలి

ప్రజాశక్తి - పంగులూరు

పాఠశాల స్థాయి నుండి విద్యార్థులు చదువుతోపాటు క్రీడల పట్ల ఆసక్తి చూపాలని రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చైర్మన్ బాచిన చెంచు గరటయ్య అన్నారు. స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాల్లోని ఎస్ఆర్ఆర్ ఖో ఖో అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం నుండి నిర్వహిస్తున్న సూపర్ లీగ్ ఖోఖో పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గరటయ్య మాట్లాడారు. గత మూడు దశాబ్దాలుగా ఖో ఖో క్రీడలో వందలాది మంది ఉత్తమ శిక్షణ పొంది, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆడి తమ ప్రతిభా పాటవాలు ప్రదర్శించారని అన్నారు. కూటమి ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని, ఖోఖో క్రీడలో రాణించిన అనేక మంది క్రీడాకారులు పోస్టల్, రైల్వే, పోలీసులతోపాటు ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందటం ఆనందించదగ్గ విషయం అన్నారు. విద్యార్థి దశలో క్రీడల్లో ప్రతిభ చాటిన అనేక మంది ఉన్నత విద్యలు అనేక అవకాశాలు అందిపుచ్చుకున్నారని అన్నారు. పంగులూరు కేంద్రంగా ప్రో కబడ్డీ సలహాలు, ప్రో ఖో ఖో ఈవెంట్లకు సన్నాహాలు చేసామన్నారు. ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీలో శిక్షణ పొంది, జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులను జట్టుగా విభజించి, సూపర్ లీగ్ ఖోఖో పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ నిర్వాహకులు మేకల సీతారామరెడ్డి అన్నారు. పోటీల ప్రారంభం సందర్భంగా జాతీయ జెండాను, క్రీడ జెండాను ఆవిష్కరించారు. స్థానిక మహిళలు ప్రదర్శించిన కోలాట ప్రదర్శన, కళాశాల పూర్వ విద్యార్థిని విజయ నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ బత్తుల వీరనారాయణ, రాయిని రామారావు, ట్రెజరర్ షేక్ కాలేషావలి, చిలుకూరి వీరరాఘవయ్య, రాయిని వెంకట సుబ్బారావు, అంతర్జాతీయ ఖో ఖో క్రీడాకారులు శివారెడ్డి, సౌజన్య, ప్రజా కళాకారుడు నందవరపు, జాన్ సాహెబ్ పాల్గొన్నారు.

ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని కుంకుపాడు పంచాయతీలోని రాళ్లపల్లి ఎస్సీ కాలనీ 150 కుటుంబాలు నివాసం ఉంటున్నారు. కాలనీకి సంబంధించిన స్మశానం తరతరాలుగా ప్రజలు ఉపయోగించుకుంటున్నారు. గత రెండేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణంలో స్మశానం పూర్తిగా ఉపయోగించుకునే వీలు లేకుండా పోయింది. అప్పటి నుండి కాలనీలోని 150 కుటుంబాలు స్మశానానికి స్థలం కేటాయించాలని అధికారులు చుట్టూ తిరుగుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో సమస్య పరిష్కరించలేదని గ్రామస్తులు వినతి పత్రంలో వివరించారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దారు కార్యాలయంలో గ్రీవెన్స్‌లో గ్రామస్తులతో కలిసి ఎంఆర్‌పిఎస్ నాయకులు వినత పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో రాళ్లపల్లి ఎంఆర్‌పిఎస్ గౌరవ సలహాదారుడు పూనూరి నెహెమియా, మండల ఇన్చార్జి పాలుపోగు సుబ్బారావు పాల్గొన్నారు.

వినతి పత్రం అందజేస్తున్న ఎస్‌సి కాలనీ వాసులు

పర్చూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పెరగనున్న కొనుగోలు శక్తి

ప్రజాశక్తి - పర్చూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీ తగ్గింపు నిర్ణయం వల్ల పేద, మధ్యతరగతి ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందని ఇన్చార్జి ఎంపిడిఒ వెంకటస్వామి తెలిపారు. ప్రభుత్వాలు తగ్గించిన జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించడానికి అధికారులు, సచివాలయం సిబ్బందితో కలిసి సోమవారం అవగాహన ఎంపిడిఒ కార్యాలయం నుండి బొమ్మల సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఏ వస్తువుపై జీఎస్టీ ఎంత తగ్గించారు? ప్రజలు అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. అలాగే షాపుల యజమానులు తగ్గించిన జీఎస్టీ వల్ల అవగాహన కలిగి ఉండి అమ్మకాలు సాగించాలని చెప్పారు. జీఎస్టీ తగ్గింపు వల్ల పేద, మధ్య తరగతి కుటుంబాలకు నెలకు రూ.1200 నుండి రూ.1500 వరకు భారం తగ్గుతుందని చెప్పారు. జిల్లా సిటీఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు ఫలాలు ప్రజలకు చేరువ అవ్వాలనే ఉద్దేశంతో అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు నిత్యం వాడే సరుకులపై, క్యాన్సర్ మందు బిళ్లలపై, ఇన్సూరెన్స్‌పై, రైతు వ్యవసాయ పరికరాలపై, ఎలక్ట్రానిక్ వస్తువులు, వాహనాలపై జీఎస్టీ తగ్గిందని పేర్కొన్నారు. షాపుల్లో వస్తువులు తీసుకున్న అనంతరం బిల్లులు తీసుకోవాలని చెప్పారు. 28శాతం జీఎస్టీ ఉన్న వస్తువుల మీద 18 శాతం, 12 శాతం జీఎస్టీ ఉన్న వస్తువుల మీద 5శాతంకు తగ్గింపు జరిగిందని, ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. జీఎస్టీ తగ్గింపు వల్ల కొనుగోలు శక్తి పెరుగుతుందని, వ్యాపారస్తుల టర్న్ ఓవర్ పెరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ షంషుద్దీన్, వాణిజ్య విభాగం నాయకులు మామిడిపాక హరి ప్రసాద్, అడపాల కృష్ణ, సామ్రాజ్యం, గోపి, డిప్యూటీ ఎంపిడిఒ కె సత్యనారాయణ, ఎఒ శకుంతల, ఏపిఎం రామకృష్ణ, ఎపిఒ రమేష్, పంచాయతీ కార్యదర్శి మస్తానరావు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు పాపను అప్పగిస్తున్న సిఐ సుబ్బారావు

తల్లి చెంతకు బాలిక

ప్రజాశక్తి - చీరాల

షాపింగ్ నిమిత్తం క్లాత్ మార్కెట్‌కు వచ్చిన జె పంగులూరుకు చెందిన రాజ్‌కోటి దంపతుల నాలుగేళ్ల కుమార్తె ఆరాధ్య తల్లిదండ్రులకు కనబడకుండా ప్రమాద వశాత్తు తప్పి పోయింది. అయితే క్షణాలు గడుస్తున్న కొద్దీ తల్లిదండ్రుల ఆందోళన పెరిగి ఎంత వెతికిన అర్థం కావడంతో హుటాహుటిగా ఒకటో పట్టణ పోలీసులను ఆ దంపతులు ఆశ్రయించారు. దీంతో సమాచారం అందుకున్న వెంటనే సీఐ సుబ్బారావు పోలీసు సిబ్బందిని, శక్తి టీంను అప్రమత్తం చేశారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి మార్కెట్ పరిసరాల్లో గాలింపు చర్యలు ప్రారంభించారు. సకాలంలో చర్యలు తీసుకోవడంతో కేవలం గంటలోపే పాప ఆరాధ్య ఆచూకీ లభ్యమైంది. చిన్నారిని సురక్షితంగా తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. తన కూతురిని మళ్లీ ఒడిలోకి తీసుకున్న తల్లి కళ్లలో ఆనందం వ్యక్తం చేశారు. ఈ ఘటన అక్కడున్న వారందరినీ కదిలించింది. వెంటనే స్పందించి చిన్నారిని తల్లిదండ్రుల వద్దకు చేర్చిన పోలీసుల పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - అద్దంకి

ఎఎన్‌ఎం, ఆశా వర్కర్ పని చేసే ప్రాంతాల్లో పని చేసే ప్రాంతంలో హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి భాధిత గర్భిణీ స్త్రీలు ఎవరైనా ఉంటే గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందించడంలో సహకరించాలని, వారి నుండి బిడ్డకు సంక్రమించకుండా మందులు వాడుకునే పద్ధతులు ఉన్నాయని తెలిపారు. హెచ్ఐవి, ఎయిడ్స్ వ్యాధి బాధ్యత బాలల ఎవరైనా ఉంటే గుర్తించి మెరుగైన వైద్య సేవ అందించాల్సిన ఆవశ్యకత ఉందని పట్టణంలోని గరటయ్య కాలనీలో హెల్ప్ స్వచ్ఛంద సంస్థ టిఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ బివి సాగర్ ఆధ్వర్యంలో ఇంటెన్స్ ఫైడ్ ఐఇసి గరటయ్య కాలనీలో ఏర్పాటు చేసిన ఎఎన్‌ఎం అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్ప్ టిఐ అద్దంకి ఔట్రిచ్ వర్కర్ టి దుర్గభవాని, పి పార్వతి, ఎంపిహెచ్ ఎం సుబ్బులు, డివి సుజాత పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులు పోరుబాట

ప్రజాశక్తి - వేటపాలెం

గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న వివిధ శాఖల ఉద్యోగులు ప్రస్తుతం పోరుబాట దిశగా పయనిస్తున్నారు. తమ శాఖల జాబ్ చార్ట్ ప్రకారం బాధ్యతలు నిర్వహిస్తూనే అదనపు పనుల పేరుతో వేకువ జామునే సామాజిక పెన్షన్ల పంపిణీ, సర్వే వంటి భారం మోపడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అనవసర ఒత్తిడి పెరుగుతోందని స్పష్టం చేశారు. అక్టోబర్ 1న సామాజిక పెన్షన్ల పంపిణీకి దూరంగా ఉండే చర్యలు చేపడతామని జెఎసి రాష్ట్రస్థాయిలో స్పష్టం చేసింది. దీని కోసం ఈపాటికే అధికారిక వాట్సాప్ గ్రూపుల నుండి ఉద్యోగులు నిష్క్రమించడం ద్వారా తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బంది తమ వినతిపత్రాన్ని ఎంపిడిఒ ఎం రాజేష్ బాబు, తహశీల్దారు జి గీతరాణికి అందజేశారు. భవిష్యత్తు కార్యాచరణ వివరించారు.

పునరావాస కేంద్రాలు సిద్ధం

ప్రజాశక్తి - రేపల్లె

కృష్ణ నదిలో నీటి ప్రవాహం పెరిగిన ఎదుర్కొనడానికి అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ తెలిపారు. స్థానిక ఆర్డిఓ ఎన్ రాజ్యలక్ష్మి, డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ విజయమ్మ, డిపిఓ ప్రభాకరరావుతో కలిసి పెనుమూడి, పల్లెపాలెం, చాట్రగడ్డ, బొబ్బర్లంక, పిరాట్లంక, లంకెవానిదిబ్బ, ఎస్టీ కాలనీకి కృష్ణా నది నీటి ప్రవాహంతో ముంపు పొంచ్చి ఉన్న గ్రామాలు, పెనుమూడి, స్కూల్, బొబ్బర్లంక, పిరాట్లంక, లంకెవానిదిబ్బ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ఏర్పాటు చేసిన వసతులు పరిశీలించారు. పెనుమూడి వద్ద కృష్ణానది పరివాహ ప్రాంతాన్ని, బోట్స్‌ను పరిశీలించారు. కృష్ణ నదిలో పూర్తిగా నీటి ప్రవాహం తగ్గే వరకు పునరావాస కేంద్రంలో ఉండాలని ప్రజలకు చూచించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కృష్ణా నదికి వరద కారణంగా పునరాస కేంద్రాలకు తరలి వచ్చిన లంక గ్రామాల ప్రజలు వరద పూర్తిగా తగ్గినంతవరకు వరద ప్రాంతాలకు వెళ్ళరాదని శాసన సభ్యులు నక్కా ఆనందబాబు అన్నారు. మండలంలోని వరద ప్రభావిత పెదలంక, చింతమోటు, పెసర్లంక గ్రామాలను స్వయంగా సందర్శించారు. అక్కడి పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులను రక్షించడం ప్రభుత్వ ప్రధాన బాధ్యతని అన్నారు. పంటలు దెబ్బతిన్న రైతులకు తగిన పరిహారం అందించడానికి అధికారులు కృత నిశ్చయంతో ఉండాలని అన్నారు. ముంపు ప్రభావిత ప్రాంతాల్లో తాగునీరు, వైద్య సేవలు, ఆహార సరఫరా వంటి అత్యవసర సేవలు నిరంతరంగా అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగం అందించే సేవలకు పూర్తి సహకారం అందించామని అన్నారు. అత్యవసర అవసరాలు లేదా సమస్యలు ఉంటే స్థానిక అధికారులకు సమాచారం ఇవ్వాలిన తెలిపారు. ప్రతి ఇల్లు తిరిగి సాధారణ జీవనానికి చేరుకునే వరకు తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

గుండె సంరక్షణకు వ్యాయామం తప్పనిసరి

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

మాట్లాడుతున్న ఎఎస్‌పి వరుణారెడ్డి

ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నందు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఎఎస్‌పి పి వరుణారెడ్డి మాట్లాడుతూ 'హృదయ స్పందనను ఏ ఒక దశలో కూడా కోల్పోకూడదు' అనే నినాదంతో వరల్డ్ హెల్త్ ఆర్గనైజషన్ సూచించింది. గుండె ఆరోగ్యంపై అవగాహన పెంచడంతో పాటు జీవన శైలి మార్చుకోవడం వలన కలిగే ప్రయోజనాలు సదస్సులో తెలిపారు. ఉపాస్ హాస్పిటల్, ఉపాస్ హార్ట్ కేర్ సెంటర్, గుండె ఆరోగ్య సంరక్షణకు ఎప్పటికప్పుడు ఉచిత స్క్రీనింగ్ శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందని ఉపాస్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ ఉమాపతి చౌదరి తెలిపారు. డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ చవల, డైరెక్టర్ డాక్టర్ అనిల్ కుమార్ కాపా, డైరెక్టర్ డాక్టర్ అనపర్తి శ్రీనివాస్, ఉపాస్ హాస్పిటల్ ఇంటర్వెన్షనల్ కార్డియాలిజిస్టు డాక్టర్ శ్రీధర్ చివుకుల, డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ యాంజియోగ్రామ్ ప్రొసీజర్ ఒక నెల రోజుల (అక్టోబర్ మాసం) పాటు కేవలం రూ: 8వేలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పోకూరి శ్రీనివాస్, డాక్టర్ పవన్ కుమార్, డాక్టర్ జయవర్ధన్, డాక్టర్ సాత్విక్ అల్లాడి, డాక్టర్ సువర్ణ రాజు, డాక్టర్ గోనుగుంట్ల శ్రీనివాస్, డాక్టర్ ఎస్ రాధ, డాక్టర్ మహేష్ వేమవరపు, అనస్తీషియాలజి డాక్టర్ పవన్ కుమార్ కాకాని పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం తొలగింపుపై విచారణ

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

మాట్లాడుతున్న బాపట్ల డిఎస్పీ రామాంజనేయులు

మండలంలోని డేగరముడి ఎస్సి కాలనిలో స్థానిక పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు అంబేద్కర్ విగ్రహం మాయం చేసిన ఘటనలో కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారులు స్పందించారు. డిఎస్పీ రామాంజనేయులు, ఆర్డీఓ గ్లోరియా, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజ దెబోరా విచారణ చేపట్టారు. స్థానిక టిడిపి నాయకుని ప్రోద్బలంతో అంబేద్కర్ విగ్రహం మాయం చేశాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న డేగరముడి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, స్థానిక టిడిపి నాయకులు, ఫిర్యాదు చేసిన ఎస్సి కాలనీ వాసులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జరిగిన ఘటనపై డిఎస్పీ విచారించారు. డాక్టర్ చారువాక, నీలం నాగేంద్ర మాట్లాడారు. టిడిపి నాయకులు పంచాయతీ కార్యదర్శితో కుట్ర పూరితంగా విగ్రహాన్ని తరలించడం అడ్డుకున్న దళిత మహిళలపై దౌర్జన్యం చేయడాన్ని డిఎస్పీకి వివరించారు. సర్పంచ్ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయిస్తూ పంచాయతీలో తీర్మానం చేసి విగ్రహ ఏర్పాటుకు సహకరించాడనే అక్కసుతోనే అడ్డుకున్నారని, తమ మాట వినలేదని ఎస్సి కాలనికి చెందిన దళిత యువకులు అల్లాడి ప్రమోద్ కుమార్, జ్యోతి పోతులూరుపై తప్పుడు కేసులు పెట్టించి సీఐ వారిపై విచక్షణారహితంగా పోలీసులతో కొట్టించారని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా డిఎస్పీరామాంజనేయులు, ఆర్డీఓ గ్లోరియా మాట్లాడుతూ జరిగిన ఘటనపై పూర్తీ స్థాయి దర్యాప్తు చేస్తామని, జరిగిన ఘటనపై ఎవరి తప్పు ఉంటె వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రేపు టిటిడి కళ్యాణ మండపం ప్రారంభం

ప్రజాశక్తి - పర్చూరు

ప్రారంభానికి సిద్ధమైన కళ్యాణ మండపం

మండలంలోని నూతలపాడులో టిటిడి సహకారం, గ్రామస్తుల కృషితో రూ.3.5 కోట్ల వ్యయంతో నిర్మించిన కళ్యాణ మండపాన్ని అక్టోబర్ 1న బుధవారం ప్రారంభిస్తున్నట్లు కళ్యాణ మం డపం నిర్మాణ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. గ్రామస్తులు రూ.50 లక్షలు విరాళంగా చెల్లించగా టిటిడి రూ.2 కోట్ల నిధులు కేటాయించిందని పేర్కొన్నా రు. మండపం నిర్మాణ స్థలం కోసం రూ.60 లక్షల నిధులు వెచ్చించి యకరం ప్రైవేటు స్థలాన్ని కొనుగోలు చేసి టిటిడికి స్వాధీన పరిచినట్లు తెలిపారు. 2023 జనవరి 13న శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిం చారు. టిటిడి కేటాయించిన నిధులు సరిపోక సభ్యులు, దాతల సహకారం కోరారు. స్థానిక శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు చేతుల మీదుగా ప్రారంభో త్సవం జరుగుతుందని చెప్పారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కొలుసు పార్థసారథి, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, జెడ్‌పి చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎంపి తెన్నేటి కృష్ణ ప్రసాద్, ఉమారెడ్డి వెంకటేశ్వర్లు, తూమాటి మాధవరావు, కంచర్ల శ్రీకాంత్, ఎఇ సురేంద్రనాద్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు.

పంపింగ్ స్కీం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

రైతులకు అండగా ప్రభుత్వం

ప్రజాశక్తి - చీరాల

రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటూ వారిని ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తుందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. మండలంలోని బోయినవారి పాలెంలో తోటవారిపాలెం ఎత్తిపోతల పథకం పరిశీలించారు. పంట పొలాలకు నీటిని మోటర్ల ద్వారా అందించే ఈ సదుపాయాన్ని బటన్ నొక్కి ప్రారంభించారు. అనంతరం ఆయన రైతులతో ఆత్మీయంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో ఎత్తిపోతల పథకాలను మూత వేసి రైతులను తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేశారని అన్నారు. కానీ సిఎం చంద్రబాబు నాయుడు రాష్ట్ర వ్యాప్తంగా ఎత్తిపోతల పథకాలను తిరిగి ప్రారంభించి రైతులకు అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

మాట్లాడుతున్న చీరాల డిఎస్పి మహమ్మద్ మోయిన్

దసరా ప్రశాంతంగా జరుపుకోండి

ప్రజాశక్తి - పంగులూరు

దసరా ఉత్సవాలను గ్రామ ప్రజలు ప్రశాంతంగా సంతోషదాయకంగా జరుపుకోవాలని, ఎలాంటి వివాదాలకు పాల్పడ కుండా ప్రజలు పండుగ విజయవంతంగా నిర్వహించుకోవాలని డిఎస్పి మహమ్మద్ మొయిన్ కోరారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడుతో కలిసి ఆయన అధికారులతో మాట్లాడారు. మండలంలోని నూజిళ్ళపల్లిలో గల రాజరాజేశ్వరి స్వామి దేవాలయంలో గత పదేళ్లుగా పారువేట, సెమీపూజ, గ్రామోత్సవం జరగటం లేదు. ఈ వివాదమై అధికారులు ఇచ్చిన 43 ఆర్డర్‌పై ఒక వర్గానికి చెందిన పూజారులు కోర్టుకు వెళ్లడంతో కోర్టు ఆ ఆర్డరును రద్దు చేసింది. గ్రామంలో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు జరగకుండా దసరా ఉత్సవాలు సంతోషంగా జరుపుకునేందుకు అధికారులతో మాట్లాడారు. ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడు మాట్లాడారు. ఎలాంటి వివాదాలకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని సూచించారు. ఎవరు వివాదాలకు తావు ఇవ్వకూడదని అన్నారు. అధికారుల సలహాలు సూచనలు పాటిస్తూ గ్రామంలో ప్రశాంతంగా పండుగ జరుపుకోవాలని అన్నారు. తహశీల్దారు పి సింగారావు, సిఐ మల్లికార్జునరావు, రేణింగవరం ఎస్ఐ వినోద్ బాబు, పంగులూరు గ్రూపు దేవాలయాల ఇఒ యు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వార్డుల పునర్విభజన గజిట్ ప్రకటన

ప్రజాశక్తి - అద్దంకి

మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికి 20 వార్డులతో కొనసాగుతుందని, ప్రభుత్వ ఆదేశాను సారం పునర్విభజన చేయవలసిందిగా ఆదేశాలు రావడంతో ఉత్తర దిక్కున సింగరాయకొండ వైపు నుండి మొదలై దక్షిణ ప్రక్కగా ట్రయాంగిల్‌తో మరల సింగరకొండ వైపుగా విభజన ముగుస్తుందని, తద్వారా 7 వార్డులు అధికంగా అయ్యాయని ఈ ముసాయిదా ప్రకారం 27 వార్డులుగా ప్రభుత్వం ఉత్తర్వులతో ప్రజల అభిప్రాయ సేకరణతో కొనసాగడానికి నివేదికలు అందిస్తున్నట్లు తెలిపారు. దీనికోసం స్థానిక పురపాలక కార్యాలయంలో కమిషనర్ డి రవీంద్ర ముసాయిదా ప్రకటన చేశారు. ప్రతిపాదిత సవరణలు పరిశీలించుకొని ప్రజల సూచనలు, సలహాలు ఏడు రోజుల్లోగా అంటే అక్టోబర్ 6 లోపు కార్యాలయంకు లిఖిత పూర్వకంగా తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో టిపిఓ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

జిఎస్‌టి ఫలాలు వినియోగదారులకు చేరాలి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

జిఎస్‌టి తగ్గింపు ఫలాలు ప్రతి వినియోగదారుడు అందుకునే విధంగా అధికారులు కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 20 సూత్రాల చైర్మన్ లంకా దినకర్ తెలిపారు. జిఎస్‌టి తగ్గింపు వల్ల కలిగే ప్రయోజనాలు, వినియోగదారుల కొనుగోలు శక్తి, దేశ ఆర్థిక వ్యవస్థ పైన సానుకూల ప్రభావం అనే అంశాలపై వాణిజ్య పన్నుల శాఖ అధికారులు, ఆడిటర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లంకా దినకర్ మాట్లాడుతూ 56వ జిఎస్‌టి కౌన్సిల్ సమావేశం నిర్ణయం ప్రకారం,ఇప్పటివరకు అమలులో ఉన్న 4 కేటగిరీలు 5శాతం, 12శాతం, 18 శాతం,శాతం, 28 శాతాలను సెప్టెంబర్ 22 నుంచి 5 శాతం, 18 శాతంగా మార్చినట్లు తెలిపారు. జిఎస్‌టి తగ్గింపు తర్వాత దేశంలోని 90 శాతం కుటుంబాలకు కొనుగోలు శక్తి పెరుగుతుందని తెలిపారు. ప్రజలు వినియోగించే నిత్యావసర వస్తువులు, సేవలపై వారి రోజువారీ జీవన వ్యయం తగ్గి పొదుపు పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి సంయుక్త కలెక్టర్ జి.గంగాధర్ గౌడ్, వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ మురళీ కృష్ణ ,మున్సిపల్ కమిషనర్ రఘునాథ రెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న లంకా దినకర్

జిఎస్‌టి తగ్గింపు పై

ప్రజలకు అవగాహన కల్పించాలి : జేసీ

ప్రజాశక్తి -ఒంగోలు కలెక్టరేట్

జిఎస్‌టి తగ్గింపు ఫలాలు ప్రజలకు చేరేలా అవగాహన కల్పించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ తెలిపారు. వస్తు సేవల పన్ను తగ్గింపుపై ఏర్పాటు చేసిన ర్యాలీనికలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం జేసీ జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ అద్దంకి బస్టాండ్ వరకు సాగింది. ఈ ర్యాలీలో పొదుపు సంఘాల మహిళలు, వివిధ వాణిజ్య సంఘాల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వస్తు సేవల పన్ను తగ్గింపు ఫలాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. వస్తు సేవా పన్నుల సంస్కరణలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రజలకు నేరుగా ఆర్థిక లబ్ధి చేకూరు తుందని వివరించారు. ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంతో సూపర్ జిఎస్‌టి, సూపర్ సేవింగ్స్ పేరుతో నెల రోజుల పాటు కార్యక్ర మాలను నిర్వహించ నున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఈ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. నాలుగు వారాలు చేపట్టే ఈ కార్యక్రమాలను ఒక్కొక్క అంశంతో ప్రజల్లోకి తీసుకు వెళ్లనున్నట్లు వివరించారు. ప్రజలు అవగాహన పొందితే మేలు జరు గుతుందన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకటేశ్వరరావు, అనుబంధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న జేసీ గోపాల కృష్ణ

అర్జీలు చట్ట పరిధిలో పరిష్కరించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

ప్రజలను నుంచి వచ్చిన అర్జీలను చట్టపరిధిలో త్వరిత గతిన పరిష్కరించాలని ఎస్‌పి హర్షవర్ధన్ రాజు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యపై అర్జీలను అందజేశారు. మొత్తం 105 ఫిర్యాదులు అందాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి ఎస్‌పి స్వయంగా స్వీకరించారు. బాధితులతో ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలను సవివరంగా తెలుసుకున్నారు. ఫిర్యాదులను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరిస్తామని వారికి భరోసా కల్పించారు. చట్టప్రకారం తగిన చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం అందించాలని, ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత గడువులో తప్పనిసరిగా పరిష్కరించాలని ఎస్‌పి పోలీసు అధికారులను ఆదేశించారు. బాధితులు అధికారుల వద్దకు వచ్చి ఫిర్యాదు చేస్తే, ఆ సమస్యను పరిష్కరించినప్పుడు వారికి కలిగే సంతోషం చెప్పలేనిదని ఎస్‌పి తెలిపారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల సమస్యలను సత్వరమే సమగ్ర విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని ప్రజలు తమ ఫిర్యాదులను స్థానిక పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాలలో కూడా సమర్పించవచ్చని ఎస్‌పి తెలిపారు. భూ వివాదాలు, కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, చీటింగ్/ఉద్యోగ మోసాలు మరియు ఇతర సమస్యలకు ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్‌పి వి.వి.రమణ కుమార్, ఒంగోలు రూరల్ సిఐ ఎన్.శ్రీకాంత్ బాబు, పొదిలి సీఐ వెంకటేశ్వర్లు, మార్కాపురం సిఐ సుబ్బారావు, కొండపి సిఐ సోమశేఖర్, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్ఐ జనార్ధన్ రావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న ఎస్‌పి

మాట్లాడుతున్న తంగిరాల మహేష్

పెండింగ్ వేతనాలు చెల్లించాలని..

పారిశుధ్య కార్మికుల నిరసన

ప్రజాశక్తి - ఒంగోలుసిటీ

కోవిడ్ సమయంలో విధుల్లోకి తీసుకున్న పారిశుధ్య కార్మికు లకు మూడు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి యూనియన్ నగర కార్యదర్శి టి.విజయమ్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు టి.మహేష్ మాట్లాడుతూ అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న కార్మికులు నెలల తరబడి బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దసరా పండుగ పూట కూడా వేతనాలు వస్తాయో లేదో తెలియని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.యూనియన్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ పది సంవత్సరాలుగా పనిచేస్తున్న కోవిడ్ కార్మికులను ఆప్కాస్‌లోకి చేర్చకపోవడం అన్యాయమన్నారు. స్థానిక కార్మికులను పక్కనబెట్టి బయటి వ్యక్తులను నియమించడం దారుణమని విమర్శించారు.అనంతరం మున్సిపల్ కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వర రావుకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన కమిషనర్ వారం రోజుల్లో బకాయి వేతనాలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వి.భారతి, కె.వంశీ, కె.పద్మ, కమల, మరియమ్మ, బి.దివ్య, బి.కపాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంఘాల సేవలు అభినందనీయం

- విశ్రాంత హెచ్‌ఎం టివిఆర్. సుబ్బారావు
- భగత్ సింగ్ నగర్‌లో ఉచిత ట్యూషన్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

విద్యా హక్కు ప్రతి ఒక్కరి మౌలిక హక్కు అని, పేదల పిల్లలకు చదువు సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అయినప్పటికీ ప్రజా సంఘాలు ముందుకు వచ్చి చేస్తున్న సేవా కార్యక్రమాలు ప్రజల సంకల్ప శక్తికి నిదర్శనమని పలువురు పేర్కొన్నారు. భగత్ సింగ్ 118వ జయంతి సందర్భంగా ఒంగోలు నగరంలోని భగత్ సింగ్ కాలనీలో డివైఎఫ్ఐ భగత్ సింగ్ కాలనీ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత ట్యూషన్ సెంటర్ ను సోమవారం ప్రారంభించారు. సిఐటియు నగర ఉపాధ్యక్షులు తంబి శ్రీనివాసులు అధ్యక్షతన విశ్రాంత హెచ్‌ఎం టివిఆర్. సుబ్బారావు రిబ్బన్ కట్ చేసి ట్యూషన్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ చిన్న వయస్సులోనే సామాజిక మార్పు కోసం ప్రాణాలు అర్పించిన భగత్ సింగ్ పేరు పెట్టుకున్న కాలనీలో పేద విద్యార్థుల కోసం ఉచిత ట్యూషన్ ఏర్పాటు చేయడం శ్లాఘనీయమన్నారు. విద్యార్థులచేత హోంవర్క్ చేయించడం, అర్థం కాని పాఠాలు చెప్పడం వంటి అవసరాలను తీర్చే విధంగా ఈ కార్యక్రమం ముందుకు సాగాలని అభిలషించారు. ట్యూషన్ నిర్వాహకురాలు సామ్రాజ్యం తన చదువు ద్వారా ఇతరులకు సహాయం చేయాలన్న భావనతో ముందుకు రావడం మంచి ఉదాహరణ అని అభినందించారు. సిఐటియు జిల్లా నాయకులు చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ,భగత్ సింగ్ కాలనీ ఏర్పడి 20 సంవత్సరాలు అవుతున్నప్పటికీ పాలకులు ఇప్పటికీ మౌలిక వసతులు కల్పించలేకపోయారని విమర్శించారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అనేక సార్లు పోరాటాలు చేసినప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని ఆరోపించారు. కూలి పనులు చేసుకునే తల్లిదండ్రులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పని ప్రదేశాల్లోనే ఉండడం వల్ల పిల్లలు అభద్రతాభావంతో జీవిస్తున్నారని తెలిపారు. ఈ సమస్య పరిష్కారం కోసం ఉచిత ట్యూషన్ కేంద్రం ఏర్పాటు చేయడం సమయోచితమన్నారు. భవిష్యత్తులో కాలనీ సమస్యల పరిష్కారం కోసం వాసుల మద్దతుతో ఆందోళనలు కొనసాగిస్తామని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కన్వీనర్ టి. మహేష్, నాయకులు ఎస్‌.డి. హుస్సేన్, భావనారాయణ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెఫ్. బాబు, నాయకులు పి. వెంకటరావు, టి. సురేష్, ఐద్వా నాయకురాలు కె. విజయలక్ష్మి, యు. రాజ్యలక్ష్మి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు

ఫిర్యాదులు ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ప్రజల ఫిర్యాదులను ప్రథమ ప్రాధాన్యతతో నిర్దిష్ట గడువులోపు పరిష్కరించాలని ఎస్‌పి ఉమామహేశ్వర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి ఎస్‌పి స్వయంగా వినతులు స్వీకరించారు. వారితో ముఖాముఖి మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకొని, చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరిస్తామని వారికి భరోసా కల్పించారు. ఫిర్యాదుదారుల అర్జీలలోని వాస్తవికతను దృష్టిలో పెట్టుకొని వాటిని చట్టపరిధిలో నిర్దిష్ట గడువులోపు పరిష్కరించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. అర్జీలను పరిష్కరించడంలో జవాబుదారీతనంతో వ్యవహరించాలన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా వచ్చిన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని ఆయన హెచ్చరించారు. కుటుంబ కలహాలు, భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీల మోసాలు, ఇతర పలు సమస్యలపై 56 అర్జీలను వచ్చాయి. ఈ కార్యక్రమంలో సిసిడిఎస్‌పి పి. జగదీశ్ నాయక్, పోలీస్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న ఎస్‌పి ఉమామహేశ్వర్